
చంద్రవంక నదిపై నిర్మించిన ఆక్విడెక్టు

ప్రమాదపు అంచుల్లో బొంబాయి బ్రిడ్జి

- బ్రిడ్జిని అల్లుకున్న చెట్లు, లీకవుతున్న నీరు
- ప్రమాదం జరిగితే తాగు, సాగునీటికి ఇక్కట్లు

మాచర్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణ సమీపంలోని సాగర్ కుడి కాలువ వద్ద చంద్రవంక నదిపై బొంబాయి కంపెనీ నిర్మించిన ఆక్విడెక్టు ప్రమాదపు అంచుల్లోకి చేరుకుంది. ఆక్విడెక్టు చుట్టూ మర్రిచెట్లు, జువ్విచెట్లు అల్లుకుపోవడంతో నెర్రలిచ్చి నీరు లీకవుతోంది. సాగర్ కుడి కాలువ 15వ కిమీ వద్ద మాచర్ల సమీపంలో బొంబాయికు చెందిన కాంట్రాక్టర్ కంపెనీ ఆక్విడెక్టును నిర్మించింది. చంద్రవంక నదికి వరద నీరు ప్రవహించేందుకు బ్రిడ్జిని నిర్మించి దానిపై భాగంలో కుడి కాలువ ద్వారా 11 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం జరిగేలా బొంబాయి కంపెనీ ఆక్విడెక్టును నిర్మించింది. కింది భాగంలో ఆరు కానాలు ద్వారా 33,750 క్యూసెక్కుల చంద్రవంక వరద నీరు ప్రవహించేలా ఏర్పాట్లు చేసింది. అయితే ఆక్విడెక్టు చుట్టూ మర్రిచెట్లు, జువ్విచెట్లు అల్లుకుపోవడంతో నెర్రలిచ్చి నీరు లీకవుతోంది. బ్రిడ్జికి ఇరువైపులా పెద్ద పెద్ద వృక్షాలు పెరిగి ప్రమాదభరితంగా మారాయి.

ప్రమాదం జరిగితే..

సాగర్ కుడి కాలువ ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 6,68,230 ఎకరాలు, ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో 4,43,180 ఎకరాలు మొత్తం కలిపి 11,11,410 ఎకరాల ఆయకట్టుకు సాగు, తాగునీరు ప్రవహిస్తోంది. ఆక్విడెక్టుకు ప్రమాదం జరిగితే దాని పునర్నిర్మాణానికి భారీ వ్యయంతోపాటు సమయం వృథా అవుతాయి. అలాగే ఆయకట్టుకు సాగునీటితోపాటు తాగునీరు అందక గ్రామాలు అల్లాడిపోతాయి. ఇరిగేషన్ అధికారులు ఇప్పటికైనా దీనిపై ప్రత్యేక దృష్టి సారించి చెట్లను తొలగించి లీకులను అరికట్టాల్సి ఉంది. అయితే అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. వృక్షాలు ఆక్విడెక్టును కమ్మేస్తుంటే వారు కన్నెత్తి కూడా చూడకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. నెర్రలు పెద్దవై జరగరానిది జరిగితే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఇరిగేషన్ అధికారులు సత్వరమే స్పందించి వృక్షాలను తొలగించి మరమ్మతులు నిర్వహించి లీకులను అరికట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.


ఆక్విడెక్టు చుట్టూ పెరిగిన చెట్లు, లీకవుతున్న నీరు

మంగళగిరికి.. పసిడి వెలుగులు

- గోల్డ్ హబ్‌కు రంగం సిద్ధం
- 78 ఎకరాల్లో గోల్డ్ క్లస్టర్
- సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు
- అసైన్డ్ భూముల్లో.. భూసమీకరణ
- 171 మంది భూయజమానులకు కలుగనున్న లబ్ధి
- సీఆర్‌డీఏకు ప్రతిగా నాలుగెకరాలు
- ప్రారంభమైన కార్యాచరణ

జాతీయ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా మంగళగిరిలో అంతర్జాతీయ మార్కెట్ ఏర్పాటవుతోంది. అదే జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు. దేశంలో కెల్లా అతిపెద్ద గోల్డ్ హబ్‌గా దీనిని తీర్చిదిద్దే ప్రణాళిక రూపుదిద్దుకుంటుంది. తొలిదశలో రూ. అయిదు వేల కోట్ల పెట్టుబడులను సాధించడమే లక్ష్యంగా ఏర్పాటవుతున్న ఈ గోల్డ్‌హబ్ అతిత్వరలోనే మరిన్ని వేలకోట్ల పెట్టుబడులకు ఆకర్షణ కేంద్రంగా మారుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. నగరంలోని తెనాలి రోడ్డు వెంబడి 78 ఎకరాల విస్తీర్ణంలో దీనిని నెలకొల్పేందుకు ఏపీ సీఆర్‌డీఏ సన్నద్ధమైంది. భూసమీకరణ రూపంలో భూములను సేకరించడంతోపాటు సంబంధిత వెంచర్‌ను అభివృద్ధి చేసే బాధ్యతలను రాష్ట్రప్రభుత్వం సీఆర్‌డీఏకు అప్పగించింది. ఈ వెంచర్‌ను అభివృద్ధి చేసినందుకుగాను ఆ సంస్థకు నాలుగెకరాల భూమిని ఇచ్చేవిధంగా రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులను వెలువరించింది. ఈ మొత్తం అభివృద్ధి ప్రణాళికంతా మంత్రి నారా లోకేశ్ మస్తిష్కంలో రూపుదిద్దుకుందే కావడం గమనార్హం!


మంగళగిరిలో జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు కోసం ఎంపిక చేసిన స్థలం

(మంగళగిరి, ఆంధ్రజ్యోతి)

మంగళగిరి అభివృద్ధిని పరుగులు పెట్టించనున్న మరో ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు. దాదాపు అయిదువేల కోట్ల పెట్టుబడులతో ప్రారంభం కానున్న గోల్డ్ క్లస్టర్...మంగళగిరికి అంతర్జాతీయ చిత్రపటంలో ఓ ప్రత్యేక గుర్తింపును తీసుకురానుంది. ఈ ప్రాజెక్టును తెనాలి రోడ్డు వెంబడి అక్షయపాత్ర ఫౌండేషన్ భవన సముదాయానికి దక్షిణంగా సుమారు 78.01 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటవుతోంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం తుది నిర్ణయానికి వచ్చేసింది. ఈ ప్రాజెక్టు సన్నాహక బాధ్యతలను రాష్ట్రప్రభుత్వం ఇటీవలే జరిగిన రాష్ట్రమంత్రివర్గ సమావేశంలో సీఆర్‌డీఏకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. గోల్డ్ క్లస్టర్‌కోసం ఎంచుకున్న ఈ భూమి ఆత్మకూరు పరిధిలో సర్వే నెం.లు 132, 133, 134 కింద వున్నాయి. అయితే ఇవన్నీ అసైన్డ్ భూములు. అయినప్పటికీ రాష్ట్రప్రభుత్వం రాజధాని అమరావతి కోసం వినియోగించిన ఫార్ములానే ఇక్కడ కూడ వినియోగించేలా నిర్ణయం తీసుకుంది. భూసమీకరణ కింద 34వేల ఎకరాలకు పైగా భూములను ఒక్క పైసా ఖర్చులేకుండా తీసుకున్న రాష్ట్రప్రభుత్వం గోల్డ్ క్లస్టర్ కోసం కూడ అదే భూసమీకరణ ఫార్ములాను మళ్లీ ప్రయోగిస్తుంది. ఈ మొత్తం అసైన్డ్ భూములన్నింటినీ కూడ పూర్తిగా భూసమీకరణ కిందే తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియ ద్వారా మొత్తం 78.01 ఎకరాలను సేకరించడంతోపాటు గోల్డ్ క్లస్టర్ ఏర్పాటు బాధ్యతలను కూడ సీఆర్‌డీఏ చేపట్టేవిధంగా మంత్రివర్గ సమావేశంలో తీర్మానించారు. అంటే వెంచర్‌ను ఏర్పాటుచేయడం మొదలు మౌలిక సదుపాయాల కల్పనంతా (మిగతా 6లో)

కేస్ స్టడీగా తురకపాలెం జ్వరాలు

- గ్రామంలో మట్టి నమూనాల సేకరణ
- గాలి నాణ్యత పరీక్షలు చేసిన నిపుణులు
- నేడు ఐసీఎంఆర్ బృందం రాక

3

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి

- బీమా బాండ్లు పంపిణీ చేసిన మంత్రి మనోహర్


పారిశుధ్య కార్మికులకు బీమా బాండ్లను అందజేస్తున్న మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమాజానికి పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు మరువలేనివని పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో సోమవారం ఆయన తన సొంత నిధులతో కార్మికులకు బీమా సదుపాయాన్ని కల్పించి బాండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కరోనా కష్టకాలంలో పారిశుధ్య కార్మికులు ఎంతో ధైర్యంగా విధులు నిర్వహించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ రాధిక, కమిషనర్ శ్రీకాంత్, తహసీల్దార్ కెవి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల క్యూ

- అధిక ధరయినా చెల్లించి కొనేందుకు సిద్ధం

తెనాలి క్రైం, రేపల్లె, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓ పక్క యూరియా కొరత లేకుండా చూస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా రైతాంగంలో ఆందోళన తగ్గడం లేదు. సోమవారం తెనాలిలోని మారీసుపేట, గంగానమ్మపేట ప్రాంతాల్లో రైతులు యూరియా కోసం ఎరువుల షాపుల ముందు క్యూలు కట్టారు. ప్రస్తుతం వెదసాగు 60 రోజులకు చేరింది. పంట 70 నుంచి 90 రోజుల మధ్య చిగురు వేస్తుంది. ఈ సమయంలో పంటకు ఎరువుల అవశ్యకత ఉంటుంది. అప్పటికి యూరియా అందుతుందో లేదో అన్న ఉద్దేశ్యంతో ఎక్కువ మంది రైతులు యూరియా కోసం క్యూలు కడుతున్నారు. ప్రభుత్వం బస్తా యూరియాను రూ.270కి అందిస్తుండగా రైతులు రూ.300 నుంచి 350 చెల్లించడానికి కూడా సిద్ధపడి షాపుల వద్ద బారులు తీరుతున్నారు. దీనిని అవకాశంగా తీసుకుని కొందరు వ్యాపారులు అధిక ధరలకు అమ్మకాలు సాగిస్తున్నారు. కాగా, పలుకుబడి, నాయకుల సిఫార్సు ఉన్నవారికే షాపు యజమానులు యూరి యాను అందిస్తున్నారని రైతుల ఆరోపిస్తున్నారు. నిజాంపట్నం గ్రామంలో యూరియా కోసం రైతులు గంటలు తరబడి వేచి ఉన్నా యూరియా అందకపోవడంతో తీవ్ర ఆగ్రహం వెల్లిబుచ్చారు. యూరియా కోసం వచ్చే రైతులు ఎండలో నిలబడకుండా టెంట్‌లు వేయాలని జిల్లా ఉన్నతాధికారి ఆదేశించినా ఆ దిశగా ఇక్కడ చర్యలు చేపట్టలేదు. దీంతో రైతులు ఎండలోనే యూరియా కోసం నిలబడాల్సి వచ్చింది. రేపల్లె పట్టణంలో యూరియా కోసం రైతులు పడిగాపులు కాసి సహనం కోల్పోయి తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయనపైకి దూసుకెళ్లారు. దీంతో పోలీసులు కలగజేసుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చి రైతులను తిరిగి క్యూలో నిలబెట్టారు.


నిజాంపట్నంలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

అభినవ జ్యోతీరావ్‌పూలే సీఎం చంద్రబాబు

- గుంటూరు పశ్చిమ 'స్త్రీ శక్తి' కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్లా మాధవి



స్త్రీ శక్తి విజయోత్సవ సభలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి తదితరులు


గుంటూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో అభినవ జ్యోతిరావు పూలే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడని గుంటూరు పశ్చిమ నియయోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి కొనియాడారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఆమె ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సూపర్ సిక్స్-సూపర్ హిట్, స్త్రీ శక్తి కార్యక్రమం అట్టహాసంగా ముగిసింది. తొలుత ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి నల్లచెరువుకు చేరుకున్నారు. అక్కడ మూడు బొమ్మల సెంటర్ నుంచి ఏటుకూరు బైపాస్ వరకు మహిళలతో కలసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో హిజ్రాలు కూడా భాగమవడం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ, రాష్ట్రంలో సూపర్ సిక్స్‌లో నాలుగు పథకాలు మహిళల కోసమే పెట్టారని, కూటమి ప్రభుత్వానికి మహిళల పట్ల ఉన్న చిత్తశుద్ధికి అదే నిదర్శనమన్నారు. మహిళా సాధికారత కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రధాని మోదీ ఎంతో కృషి చేస్తున్నారని, ప్రధాని మోదీ ఆపరేషన్ సిందూర్‌ను ఇద్దరు మహిళా కమాండోలతో విజయవంతం చేసి, స్త్రీ శక్తి ఎలా ఉంటుందో ప్రపంచానికి చూపారని గళ్లా మాధవి పేర్కొన్నారు. అనంతరం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ప్రజలకు అండగా నిలిచిందన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ, ఎమ్మెల్యే మాధవి ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ కార్యక్రమం సూపర్ హిట్ అయిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించిన ఘనత చంద్రబాబు దేనని ఆయన కొనియాడారు. ఏపీ సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని మాట్లాడుతూ మహిళలు తలుచుకుంటే ఏం జరుగుతుందో, స్త్రీ శక్తి అంటే ఏమిటో ఈ రోజు మహిళలు ప్రపంచానికి చూపారన్నారు. 1995లో డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళలు స్వయంగా ఎదగటానికి అవకాశం ఇచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని, 2024 ఎన్నికల్లో జగన్ రెడ్డికి పవన్ కల్యాణ్ సినిమా చూపారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, షేక్ సజీల, నన్నపనేని రాజకుమారి, శనక్కాయల అరుణ, మాకినేని పెద్దరత్తయ్య ప్రసంగించారు. కార్యక్రమానికి శిల్పారామం కార్పొరేషన్ ఛైర్మన్ మంజులా రెడ్డి, వడ్రాణం హరిబాబు, సింహాద్రి కనకాచారి, టీడీపీ జనసేన కార్పొరేటర్లు, ఎన్డీ యే కూటమి పార్టీల రాష్ట్ర, పార్లమెంట్, అసెంబ్లీ నేతలు పాల్గొన్నారు. సభలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నెల్లూరుకు చెందిన ప్రాసమణి ప్రసంగం ఆకట్టుకుంది.


బస్సులో ప్రయాణిస్తూ టిక్కెట్లు చూపుతున్న ఎమ్మెల్యే మాధవి

రైస్ కార్డుల్లో.. తప్పుల తిప్పలు

- కుటుంబ యజమానిగా పెళ్లికాని యువతిపేరు
- తండ్రిని భర్తగా కార్డులో నమోదు..
- సచివాలయం వద్దకు వెళ్లినా పట్టించుకోని వైనం

గుంటూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైస్ కా ర్డుల తప్పులతో కుటుంబ సభ్యులకు తిప్పలు మొదల య్యాయి. కార్డు యజమానిగా మహిళే ఉండాలనే ప్రభుత్వం నిర్ణయంతో సభ్యుల నమోదులో భారీ తప్పులు జరుగుతున్నాయి. తాజాగా గుంటూరు బ్రాడీపేటకు చెందిన ఒక కుటుంబానికి ఇచ్చిన రైస్ కార్డులో తండ్రిపేరును భర్తపేరుగా నమోదు చేయడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే..



రైస్ కార్డులో తప్పుగా నమోదు చేసిన వివరాలు

గుంటూరు బ్రాడీపేట నాలుగోలైనులో చిరువ్యాపారం చేసుకునే వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి 59 ఏళ్లు. ఇటీవలే ఆయన భార్య చనిపోయింది. ఆయన తన కొడుకూ, కూతురుతో కలిసి ఉంటున్నాడు. అయితే ప్రభుత్వం తాజాగా వారికి 2813553438 నెంబరుతో స్మార్టు రైస్ కార్డు జారీ చేసింది. అందులో 21 ఏళ్ల పెళ్లికాని యువతిని కుటుంబ పెద్దగా తీసుకున్నారు. ఆమెపేరుతో కార్డును జారీ చేశారు. అందులో కుటుంబ సభ్యుల వివరాల దగ్గర తండ్రి పేరు, సోదరుడి పేరు నమోదు చేశారు. వారి వయసులు వరుసగా 59, 17 ఏళ్లు అని నమోదు చేశారు. అంతవరకూ బాగానే ఉంది. కానీ పెళ్లికాని యువతికి పెళ్లయినట్లుగా కార్డులో నమోదు చేశారు. కుటుంబ పెద్దతో సంబంధం అనే కాలమ్‌లో 59ఏళ్ల వయసున్న ఆమె తండ్రి పేరు పెట్టి కుటుంబ పెద్దతో సంబంధం అనే చోట భర్త అని నమోదు చేశారు. అదేవిధంగా ఆమె సోదరుడి పేరు నమోదు చేసి కుటుంబ పెద్దతో సంబంధం అనే చోట కొడుకు అని నమోదు చేశారు. దీంతో వరసలు తారుమారైపోయాయి. కుటుంబ పెద్ద వయసు 21ఏళ్లు ఉండడం, భర్త వయసు 59ఏళ్లు ఉండడం, కొడుకు వయసు 17 ఏళ్లు ఉండడం ఏంటన్న అనుమానం కూడా అధికారులకు రాకపోవడం విశేషం. ఆ కార్డులో వివరాలు చూసుకున్న కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై సచివాలయం వద్దకు పరుగులు తీశారు. కానీ వారు పట్టించుకోలేదు. పెళ్లికాని యువతికి పెళ్లయినట్లు కార్డులో వస్తే తామెలా తలెత్తుకోవాలి. తమ పిల్లలకు పెళ్లి ఎలా చేయాలంటూ ఆ తండ్రి ఆవేదన వ్యక్తం చేస్తు న్నాడు. జరిగిన పొరపాటు పట్ల కనీస స్పందన కూడా లేకుండా అధికా రులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడు. తక్షణం కార్డును సరిచేయాలని డిమాండ్ చేస్తున్నాడు.

నిబంధనల సడలింపుపై ఆశలు

- జిన్నింగ్ మిల్లుల యజమానులతో నేడు సీసీఐ సీఎండీ సమావేశం..!
- మార్కెటింగ్ కమిషనర్ కార్యాలయంలో చర్చలు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లుల యజమానులకు, సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కి మధ్య ఏర్పడిన ప్రతిష్ఠంభన తొలగేందుకు మార్గం సుగమమైంది. గుంటూరులోని రాష్ట్ర మార్కెటింగ్ కమిషనర్ కార్యాలయంలో జిన్నింగ్ మిల్లుల యజమానులతో సీసీఐ సీఎండీ లలిత్ కుమార్ గుప్తా మంగళవారం భేటీ కానున్నారు. పత్తి మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సీసీఐ జారీ చేసిన టెండర్ ప్రక్రియను ఏపీలోని జిన్నింగ్ మిల్లుల యజమానులు బహిష్కరించిన నేపథ్యంలో జరుగుతున్న ఈ సమావేశం ఆసక్తిని కలిగిస్తోంది. ఆగస్టు 12వ తేదీన సీసీఐ విడుదల చేసిన టెండర్ నోటి ఫికేషన్‌లోని కొన్ని నిబంధనలపై జిన్నింగ్ మిల్లుల యజమానులు భగ్గుమంటున్నారు. వాస్తవానికి ఈ సీజన్‌లో వచ్చిన టెండర్ నోటిఫికేషన్‌లోని నిబంధనలను రాష్ట్రంలోని జిన్నర్లే కాకుండా, దేశంలో మిగతా రాష్ట్రాలకు చెందిన వారు కూడా వ్యతిరేకిస్తున్నారు. బిడ్డింగ్‌కు సెప్టెంబరు 1వ తేదీని సీసీఐ గడువు విధించినప్పటికీ దేశవ్యాప్తంగా ఉన్న జిన్నింగ్ మిల్లుల యజమానులు టెండర్లు వేయలేదు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు, మిల్లులను ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3, ఎల్ 4, ఎల్ 5లుగా విభజించటం, పత్తిని ఫలానా చోటే రైతులు అమ్ము కోవాలని ఆదేశించడం, దూది నాణ్యత శాతాన్ని పెంచాలన్న నిబంధనలను మిల్లుల యజమా నులు వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 3వ తేదీన రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లుల యజమానులు, సీసీఐ అధికారులతో సచివాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిన్నింగ్ మిల్లుల యజమానుల సమస్యలను సావధానంగా విన్న మంత్రి సీఎండీతో సమావేశం నిర్వహించాలని సీసీఐ అధికారులను ఆదేశించారు. మంత్రితో సమావేశం ముగిసిన తర్వాత వ్యవసాయశాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శికి మార్కెటింగ్‌శాఖ కమిష నర్ సీసీఐ సీఎండీతో మీటింగ్ ఏర్పాటుపై లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి లేఖ వెళ్లడంతో జిన్నింగ్ మిల్లుల యాజమా నుల తో చర్చలు జరిపేందుకు సీసీఐ సీఎండీ మంగళవారం గుంటూరుకు వస్తున్నట్లు తెలి సింది. రాష్ట్ర మార్కెటింగ్ కమిషనర్ కార్యాల యంలో జరగనున్న సమావేశంలో జిన్నింగ్ మిల్లుల యజమానులతో పాటు, వ్యవసా యశాఖ, మార్కెటింగ్‌శాఖ రాష్ట్ర ఉన్నతాధి కారులు పాల్గొంటున్నట్లు సమాచారం. టెండర్ నిబంధనలను సడలిస్తే జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కు తాము సిద్ధమేనని యజమానులు చెబుతున్నారు.



బాలికతో పెళ్లి చేయాలని సెల్ టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్

తెనాలి క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తాను ప్రేమించిన అమ్మాయిని పిలిపించాలని, ఆమెను పెళ్లి చేసుకుంటానంటూ.. ఓ యువకుడు సెల్ టవర్ ఎక్కి రెండు గంటల పాటు హల్‌చల్ చేశాడు. ఈ ఘటన సోమవారం పాండురంగ పేటలో చోటుచేసుకుంది. ఉదయం 10 గంటల సమయంలో ఓ యువకుడు స్థానిక సెల్ టవర్ పైకి ఎక్కి .. పెద్దగా అరవడం ప్రారంభించాడు. దీనితో పెద్ద ఎత్తున జనం గుమిగూడారు. స్థానిక వార్డు కౌన్సిలర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అతనిని బతిమాలి కిందికి దింపారు. సదరు యువకుడు విజయనగరం జిల్లా మక్కువ మండలం, నాగులడబ్బాగడ్డకి చెందిన తాడంగి అశోక్‌గా పోలీసులు గుర్తించారు. ఇతను ఏడాది క్రితం తెనాలి వచ్చి తాపీ పనులు చేసుకుంటున్నాడు. అదే వీధిలో ఉంటున్న ఇంటర్మీడియెట్ చదువుతున్న 16 ఏళ్ల మైనరు బాలికను ప్రేమించానని.. బెదిరించి ఆ అమ్మాయిని పెళ్లికి ఒప్పించడానికే తాను సెల్ టవర్ ఎక్కానని తెలిపాడు. పోలీసులు విచారించగా అతను ఎవరో ఇంత వరకు చూడలేదని సదరు బాలిక తెలిపింది.ఈ క్రమంలో స్థానిక యువకులు ఆ యువకుడికి దేహశుద్ధి చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు ఎస్ఐ ఎన్.ప్రకాశరావు తెలిపారు.


పోలీసుల అదుపులో యువకుడు

పలు ఎక్స్‌ప్రెస్‌లకు రైల్వేస్టేషన్లలో స్టాపుల పునరుద్ధరణ

గుంటూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గతంలో కొన్ని రైల్వేస్టేషన్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఉన్న నిలుపుదల సౌకర్యాన్ని వివిధ కారణాలు చూపిస్తూ తొలగించిన రైల్వే శాఖ వాటిని పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించింది. 17211 మచిలీపట్నం - యశ్వంత్‌పూర్ కొండవీడు ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 10 నుంచి బేతంచర్ల, దొనకొండ, 17212 యశ్వంత్‌పూర్ - మచిలీపట్నం కొండవీడు ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 11 నుంచి బేతంచర్ల, దొనకొండ, 17222 ఎల్‌టీటీ - కాకినాడ ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 11 నుంచి మౌలాలి, 17225 నరసపూర్ - హుబ్లీ అమరావతి ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 10 నుంచి కురిచేడు, దొనకొండ, 17226 హుబ్లీ - నరసపూర్ అమరావతి ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 10 నుంచి దొనకొండ, కురిచేడు, 17255 నరసపూర్ - లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 10 నుంచి బీబీనగర్, పిడుగురాళ్ల, 17256 లింగంపల్లి - నరసపూర్ ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 10 నుంచి పిడుగురాళ్ల, 17625 కాచీగూడ - రేపల్లె డెల్టా ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 10 నుంచి పిడుగురాళ్ల, 17626 రేపల్లె - కాచీగూడ ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 10 నుంచి పిడుగురాళ్లలో నిలుపుదల సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు రైల్వేబోర్డు పేర్కొంది. 18047 షాలిమార్ - వాస్కోడిగామ ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 11 నుంచి దొనకొండ, 18048 వాస్కోడిగామ - షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 10 నుంచి దొనకొండ, 18463/18464 భువనేశ్వర్ - బెంగళూరు సిటీ - భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ నెల 10 నుంచి దొనకొండలో నిలుపుదల సౌకర్యాన్ని కల్పించారు.

శ్మశానంలో రేకుల షెడ్డు, నీళ్ల ట్యాంకు ధ్వంసం

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చమళ్ళమూడి గ్రామ శ్మశానంలో మృతుల అంత్యక్రియల కోసం దాతలు నిర్మించిన రేకుల షెడ్డు, నీళ్ల ట్యాంక్, బల్లలను ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీనిపై గ్రామస్థులు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఇనుప కంచెను కూడా ఇప్పటికే తొలగించారని, ఇది కావాలని గ్రామానికే.. చెందిన కొందరు ప్రోత్సహించి.. ధ్వంసం చేయించారని ఇతర గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. తహసీల్దార్‌కు కూడా అర్జీ ఇచ్చినట్టు పేర్కొన్నారు. సీఐ రమా నాయక్ శ్మశానంలో ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై ఈ ప్రభావం తీవ్రంగా ఉంటుందని, కొందరు కావాలని ఈ విధంగా చేస్తున్నారని గ్రామస్థులు అంటున్నారు.


శ్మశానంలో కూల్చిన రేకుల షెడ్డు

11న ఉప ముఖ్యమంత్రి పర్యటన

బాపట్ల,సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ఈ నెల 11న బాపట్ల జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై అన్ని శాఖల జిల్లా అధికారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మడ అడువుల అభివృద్ధిలో భాగంగా సూర్యలంక తీరంలో మడ మొక్కలను ఉప ముఖ్యమంత్రి నాటుతారని తెలిపారు. పవన్ కల్యాణ్ పర్యటన ఖరారు కావడంతో అధికారులంతా అప్రమత్తం కావాలన్నారు. మంత్రి పర్యటన సజావుగా సాగడానికి సమగ్ర ప్రణాళికతో అధికారులు ముందుకు సాగాలని ఆయన ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లు చూసుకోవాలని ఎస్పీకి సూచించారు. తీర ప్రాంతంలో పారిశుధ్యం, హెలీపాడ్ వద్ద ప్రొటోకాల్ అమలు, స్టాల్స్ ఏర్పాటుపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎస్పీ తుషార్‌డూడీ, ఇన్‌చార్జి జేసీ, డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువులో విషప్రయోగం

చేబ్రోలు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువులో విష ప్రయోగం చేయడంతో చేపలు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని వేజండ్ల గ్రామం ఎస్సీ కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన రాజేష్ అనే వ్యక్తితో పాటు కొంతమంది కలసి చెరువును పంచాయతీ నుంచి రూ.లక్షన్నరకు లీజుకు తీసుకున్నారు. రూ.2లక్షల వెచ్చించి చేప పిల్లలను పెంచుతున్నారు. దాణా తదితర ఖర్చుల నిమిత్తం మరో రూ.3లక్షలు వెచ్చించారు. ఉదయం రాజేష్ చెరువు వద్దకు వెళ్లే సరికి అధిక సంఖ్యలో చేపలు చనిపోయి ఒడ్డుకు కొట్టుకు రావడం గమనించాడు. విషప్రయోగం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.


తేలాడుతున్న చేపలు


ఆత్మహత్య నివారణ చర్యలు తీసుకోవాలి

● ఏఎన్‌యూ వీసీ ఆచార్య గంగాధరరావు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య గంగాధరరావు

ఏఎన్‌యూ, సెప్టెం బర్ 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆత్మహత్య ల నివారణ అవగాహన కార్య క్రమాలు యువత కు ఎంతో దోహద పడతాయని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ ఆచార్య గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీలోని సైకాలజీ విభాగంలో పది రోజుల పాటు సమాజంలో ఆత్మహత్యల నివారణ పై అవగాహన సదస్సులు నిర్వహించారు. సైకాలజీ విభాగ విద్యార్థులు ఫార్మసీ, ఇంజనీరింగ్, ఆర్ట్స్, సైన్స్ విభాగాలకు వెళ్లి అవగామన కల్పించారు. అనంతరం వీసీని ఆయన చాంబర్‌లో కలిసి అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థుల చైతన్యంతో ఆత్మహత్యలపై సమాజంలో మార్పులు తీసుకుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సైకాలజీ విభాగ అధ్యాపకులు జి.చెన్నారెడ్డి పాల్గొన్నారు.

అంబటి అవినీతిపై విచారణ చేపట్టాలి


కలెక్టరేట్‌కు వచ్చిన విజయ్ కిరణ్‌బాబు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అంబటి రాంబాబు అవినీతిపై విచారణ చేపట్టాలని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి యర్రమాల విజయ్ కిరణ్‌బాబు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏపీఐఐసీ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో డోకిపర్రులోని వెనుకబడిన కులాల వారికి కేటాయించాల్సిన షెడ్డులను.. తన అనుచర కుటుంబానికి కేటాయించుకుని అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఏపీఐఐసీ నియమ నిబంధనల ప్రకారం లీజు నుంచి ఔట్‌రైట్ సేల్‌ను చేసిన వారిపై విజిలెన్స్ విచారణ చేసి.. నివేదికలో నేరాన్ని నిరూపించిందని పేర్కొన్నారు. ప్రభుత్వ రాయితీలు పొందడంలో కూడా.. అనేక అక్రమాలకు పాల్పడ్డారని.. ఈ మొత్తం స్కాంలో ప్రధాన సూత్రధారి అంబటి రాంబాబు, అతని అనుచరులపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

మంగళగిరికి.. పసిడి వెలుగులు

(5వ పేజీ తరువాయి)

సీఆర్‌డీఏ ఆధ్వర్యంలోనే జరుగుతుంది. ఇందుకుగాను మొత్తం 78 ఎకరాల్లో సీఆర్‌డీఏకు నాలుగెకరాలను అప్పగించాల్సి వుంటుంది.

గోల్డ్ హబ్ ఏర్పాటుకోసం సీఆర్‌డీఏ 78.01 ఎకరాలను భూసమీకరణ రూపంలో ప్రభుత్వానికి పైసా ఖర్చు లేకుండా సేకరించనుంది. ఈ మేరకు ఈ ప్రక్రియను ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించింది. ఇక్కడ మొత్తం భూయజమానుల సంఖ్యను 171గా గుర్తించారు. ఇందులో ఎక్కువమంది 17 సెంట్ల వంతున కలిగివున్నారు. 171 మంది భూయజమానుల్లో సుమారు వందమందికిపైగా 2008లో ప్రభుత్వం నుంచి భూములను పొందినవారే. మొత్తం 171 మందిలో కేవలం 59 మంది మాత్రమే ఒరిజనల్ ఎస్సైనీలుగా వున్నట్టు రెవెన్యూ అధికారులు గుర్తించారు. మిగిలినవారంతా భూములను అనధికారికంగా ఇతరులకు విక్రయించారు. అయినప్పటికీ...కొనుగోలుదారులను కూడ భూయజమానులుగానే గుర్తించాలని స్థానిక శాసనసభ్యుడు, మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. నిజానికి అసైన్డ్ భూముల క్రయవిక్రయాలు చెల్లనేరవు కనుక చట్టం ప్రకారం చేయిమార్పిడి జరిగితే ఆ భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకునే వెసులుబాటు వుంది. అయినప్పటికీ మంత్రి లోకేశ్ మానవతా దృక్పథంతో కొనుగోలుదారులను కూడ భూ యజమానులుగానే గుర్తించాలని ఆదేశించడంతో రెవెన్యూ అధికారులు వారిని కూడ పరిగణనలోకి తీసుకుంటున్నారు. కాగా, ప్రస్తుత సందర్భంలో మొత్తం భూయజమానులు 171 మందిలో ఇప్పటికే 151 మంది భూసమీకరణ కింద తమ భూములను ఇచ్చేందుకు ప్రభుత్వానికి అంగీకారపత్రాలను అందజేశారు. మిగిలిన 20 మంది ఆచూకీ అధికారులకు ఇంకా లభ్యం కాలేదు. వారిని కూడ గుర్తించేందుకు రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహిస్తున్నారు. భూసమీకరణ కింద భూములను ఇచ్చినవారికి రాజధాని ప్యాకేజీలనే ఇక్కడ కూడ అమలుచేయనున్నారు. జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు కోసం సీఆర్‌డీఏ రూపొందించనున్న వెంచర్‌తో సంబంధం లేకుండా వెంచర్‌కు వెనుకవైపు ప్రాంతంలో ప్రత్యేకంగా వీరికి కూడ కొన్ని ప్లాటులను కేటాయిస్తారని అంటున్నారు. ఇవన్నీ నివాసయోగ్యమైన ప్లాట్ల రూపంలో వుంటాయంటున్నారు. అయితే ఈ ప్లాట్ల పంపిణీ విషయానికొస్తే...ఒరిజినల్ ఎస్సైనీలకు ఒకలాగున, కొనుగోలుదారులకు ఇంకోలాగున ప్యాకేజీలను కేటాయిస్తారని అంటున్నారు. సుమారుగా 175 నివాసిత ప్లాట్లను వేర్వేరు విస్తీర్ణాలలో వచ్చేవిధంగా ప్రధాన కమర్షియల్ వెంచర్‌కు వెనుక భాగంలో ప్రత్యేక వెంచర్‌గా అభివృద్ధి చేసి అప్పగిస్తారు. ఈ నివాసిత ప్లాట్ల వెంచర్, ప్రధానమైన గోల్డ్‌క్లస్టర్ తాలూకు వెంచర్‌కు మధ్య సీఆర్‌డీఏకు దక్కాల్సిన నాలుగెకరాలు వుంటాయి.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

వినుకొండటౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుంటి ఆంజనేయ నాగమయ్య పుట్ట సమీపంలోని విశ్రాంత బల్లాపై వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని సోమవారం పోలీసులు గుర్తించారు. మృతుడు తెలుపు రంగు టీషర్టు, నల్ల ప్యాంట్, నెరిసిన గడ్డంతో ఉన్నట్లు తెలిపారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

అనుమతులు ఇవ్వలేదని అసత్య ప్రచారం తగదు

● కమిషనర్ పులి శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో హోల్ సేల్ కూరగాయల మార్కెట్ కోసం దరఖాస్తు చేయకుండానే నగరపాలక సంస్థ నుంచి అనుమతులు ఇవ్వడం లేదని అసత్య ప్రచారం చేయడం సరి కాదని, నిర్దేశిత విధానం ద్వారా మార్కెట్ ఏర్పాటు కోరుతూ అనుమతుల కోసం దరఖాస్తు చేస్తే వేగంగా ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్ లో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.

కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ కొల్లి శారద హోల్‌సేల్ మార్కెట్‌లో చట్ట ప్రకారం 25 ఏళ్ల కాల పరిమితి ముగిసిన 81 షాప్‌లకు ప్రభుత్వ నిబంధనలు మేరకు రోస్టర్ పాటిస్తూ అదనపు కమిషనర్ నేతృత్వంలో 3 రోజులపాటు బహిరంగ వేలం నిర్వహించామన్నారు. గతంలో మార్కెట్ షాప్‌ల నుంచి ఏడాదికి జీఎంసీకి రూ.81 లక్షలు ఆదాయం వచ్చేదని, ప్రస్తుతం వేలం ద్వారా రూ.6 కోట్లు ఆదాయం వస్తుందన్నారు. బహిరంగ వేలానికి ముందే అప్పటికే అక్కడ వ్యాపారం చేస్తున్న వారితో పలు దఫాలు ప్రజా ప్రతినిధుల సమక్షంలో వేలం నిర్వహించేందుకు సహకరించాలని కోరగా కొంత గడువు అడిగారని, గడువు ముగిసిన తర్వాత షాప్‌లు ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వగా కొందరు కోర్టులో కేసులు దాఖలు చేశారన్నారు. హైకోర్టు కూడా కమిషనర్‌తో చర్చించుకోవాలని, కమిషనర్ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించి కేసులను డిస్పోజ్ చేయడం జరిగిందన్నారు. కాని కొందరి ప్రోద్బలంతో ఇప్పటి వరకు వ్యాపారాలు చేసిన వారు నిబంధనలకు విరుద్ధంగా, అనధికారికంగా జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుని బ్లాక్ చేస్తూ, కనీసం ట్యాక్స్ కట్టని అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో రైతులను మభ్యపెట్టి కూరగాయల వ్యాపారం చేస్తున్నారన్నారు. నిబంధనల మేరకు మార్కెట్ ఏర్పాటుకు కావాల్సిన విధానంలో దరఖాస్తు చేసుకుంటే కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ప్రజా ప్రతినిధులు, మేయర్ అవకాశం మేరకు వేగంగా అనుమతులు ఇవ్వాలని సూచించారని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ ఏడాది మిషన్ గ్రీన్ గుంటూరులో భాగంగా దశల వారీగా 5 లక్షలు మొక్కలను నాటాలని సంకల్పించామని, అందుకు అనుగుణంగా ప్రభుత్వ సంస్థ అర్బన్ గ్రీన్ కార్పొరేషన్ ద్వారా నగరంలోని డివైడర్లు, ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటడానికి సర్వే చేసి, టెండర్ ద్వారా మొక్కలను కొనుగోలు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనధికార లే అవుట్స్‌ని క్రమబద్ధీకరించుకోవడానికి అవకాశం కల్పించిందన్నారు.

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలి

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌కు ప్రజలు అందించే ఫిర్యాదులు, అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులకు స్పష్టం చేశారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 31 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్ ద్వారా 28 అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఇంచార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఎంఒహెచ్(ఇంచార్జి) రామారావు, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతే ధ్యేయంగా కృషి జరగాలి

● జనచైతన్య వేదిక

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అక్షరాస్యతలో దేశంలోనే అట్టడుగున 36వ స్థానంలో నిలిచిందని, రాష్ట్ర ప్రభుత్వం అక్షరాస్యత పెంపుదలను ప్రాధాన్యత అంశంగా గుర్తించి సంపూర్ణ అక్షరాస్యత సాధనకై ప్రజల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున కృషి చేయాలని జనచైతన్య వేదిక నిర్వహించిన 59వ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ సభలో వక్తలు అన్నారు. గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో సోమవారం జరిగిన అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ సభకు జనచైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ అక్షరాస్యతలో దేశంలో అట్టడుగున ఉండటమే కాకుండా ప్రాంతీయ అసమానతలు గణనీయంగా కొనసాగుతున్నాయని అన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ 2023 - 2024 పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం ఆంధ్రప్రదేశ్ 72.6 శాతం అక్షరాస్యతతో దేశంలో 36వ స్థానంలో ఉందని, మహిళ అక్షరాస్యత 66 శాతంగానే ఉందని తెలిపారు. విద్యావేత్త ప్రొఫెసర్ డీఏఆర్ సుబ్రహ్మణ్యం, కన్నా విద్యాసంస్థల వ్యవస్థాపకులు కన్నా మాస్టర్, సామాజిక విశ్లేషకులు టి.ధనుంజయరెడ్డి, మానవత కార్యదర్శి కె.సతీష్, ప్రముఖ సైకాలజిస్ట్ అడపా వేణుగోపాలరావు, ఆవాజ్ నేత చిస్టీ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

10న జేసీ బాధ్యతల స్వీకారం

గుంటూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ ఈ నెల 10వ తేదీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు ఆయన సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూవర్గాలకు సమాచారం అందించారు. దీంతో నూతన జేసీ బాధ్యతల స్వీకారానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు ప్రస్తుత జేసీ భార్గవ తేజ మంగళవారం రిలీవింగ్ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

ఇండి-గ్యాప్ సర్టిఫికేషన్‌తో రైతుకు ఆదాయం

గుంటూరు సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించే సేంద్రియ పంటలకు ఇండి-గ్యాప్ సర్టిఫికేషన్‌తో మంచి ఆదాయం, ప్రజలందరికీ ఆరోగ్యం చేకూరుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సేంద్రీయ ఉత్పత్తుల ధ్రువీకరణ అథారిటీ చైర్మన్ సవాలా దేవదత్ అన్నారు. గుంటూరు లాం ఫామ్‌లో సోమవారం జరిగిన ఇండి-గ్యాప్ సర్టిఫికేషన్ ఒక్క రోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ 2047లో భాగంగా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ను సాధించే దిశగా అడుగులు వేస్తున్నారని అన్నారు. ఆహారమే ఔషధం, వ్యవసాయ క్షేత్రమే ఔషధాలయం కావాలన్న ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా నడుచుకోవాలని పిలుపు నిచ్చారు. వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయపు జేడీ ఏ.బాలు నాయక్ మాట్లాడుతూ స్కోప్ సర్టిఫికెట్ జారిచేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం చేకూరడంతోపాటు వినియోగదారుల ఆరోగ్యం మరింత భద్రతకు భరోసా ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సేంద్రీయ ఉత్పత్తుల ధ్రువీకరణ అథారిటీ డైరెక్టర్ డాక్టర్ యడ్లపాటి సతీష్ మాట్లాడుతూ జిల్లాల నుంచి వచ్చిన మూల్యాంకన అధికారులు శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని అన్ని విషయాలపై శిక్షణ పొంది, యుద్ధ ప్రాతిపదికన సర్టిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ మేనేజర్ డాక్టర్ యుగంధర్, ఇండి-గ్యాప్ సర్టిఫికేషన్ స్టేట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ మూల ప్రతాప్‌రెడ్డి, మూల్యాంకన అధికారిణి డాక్టర్ సారిక, పొలం బడి విభాగపు ఏడీఏ వెంకటేశ్వర్లు, వ్యవసాయ అధికారిణి కిరణ్మయి పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సేంద్రీయ ఉత్పత్తుల ధ్రువీకరణ అథారిటీ చైర్మన్ సవాలా దేవదత్, డైరెక్టర్ డాక్టర్ యడ్లపాటి సతీష్ తదితరులు

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 276 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, డీఆర్వో ఖాజావలి తదితరులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 276 అర్జీలు వచ్చాయి. డీఆర్వో ఖాజావలీ, డిప్యూటి కలెక్టర్లు లక్ష్మికుమారి, గంగరాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్‌తో కలిసి ఆమె అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎంవో నుంచి అందిన అర్జీలను ఆయా శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీపీవో నాగసాయికుమార్, హౌసింగ్ పీడీ ప్రసాదు, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాబు, ఉద్యాన శాఖ అధికారి రవీంద్రబాబు, పశుసం వర్థక శాఖ డీడీ కేవీవీ సత్యనారాయణ, గ్రామ, వార్డు సచివాలయాల కో ఆర్డినేటర్ మోహన్‌రెడ్డి, డీఎఫ్‌వో హిమశైలజ, ఐసీడీఎస్ పీడీ జ్ఞాన ప్రసూన పాల్గొన్నారు.

● స్థానిక బీఆర్ స్టేడియానికి మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని గుంటూరు ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్ అర్జీ అందజేశారు. పదేళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో నిర్వీర్యంగా మారిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి స్టేడియంను ఆధునీకరించి వసతుల కల్పనతో పాటు అన్ని క్రీడలకు సంబంధించిన కోచ్‌లను నియమించాలని కోరారు.

● గుంటూరు రూరల్ మండలం, తురకపాలెంలో అనారోగ్యంతో చనిపోయిన ప్రతి ఒక్కరి కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థిక సాయం ప్రకటించాలని కోరుతూ సీపీఎం నాయకులు అర్జీ అందజేశారు. గ్రామంలో అనుమతులు లేని ప్రైవేటు బోరులను నిలుపుదల చేసి పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో సీహెచ్ బాబురావు, వై నేతాజీ, ఈమని అప్పారావు, నళినీకాంత్, భావన్నారాయణ, కాపు శ్రీనివాసరావు, వెంకట్రావు తదితరులు ఉన్నారు.

● ఇమామ్, మౌజన్‌లకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలను విడుదల చేయాలని కోరుతూ వైసీపీ నాయకులు అర్జీ అందజేశారు. ఇమామ్‌లకు పదివేలు, మౌజన్‌లకు రూ 5 వేలు నిరంతరం చెల్లిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినట్టు గుర్తు చేశారు. కానీ సెప్టెంబర్ నాటికి ఎనిమిది నెలల గౌరవ వేతనం పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి షేక్ గులాం రసూల్, నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా తదితరులు ఉన్నారు.

● మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న నేపథ్యంలో ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు చూపించాలని ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఎన్నికల హామీలో భాగంగా వాహనమిత్ర పథకం కింద డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న డ్రైవర్‌కు ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సాయం ఇవ్వాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ నాయకులు నన్నపనేని శివాజీ, డ్రైవర్లు మస్తాన్‌వలీ, కొండలు, యాకోబు, యు దుర్గారావు, కే గోపి, వెంకట్రావు తదితరులు ఉన్నారు.

● శంకర్‌విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు సాగుతున్నందున రాక, పోకలకు రైల్వేస్టేషన్‌ను వినియోగించుకునేందుకు అనుమతులు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కలెక్టర్‌ను కోరారు. ఏసీ, మహిళా, హిందూ కాలేజీలలో చదువుతున్న విద్యార్థులు గతంలో కాలేజీలకు వెళ్లేందుకు బ్రిడ్జి మీద నుంచి నడుచుకుంటూ వెళ్లేవారని తెలిపారు. రైల్వే అధికారులు ఫ్లాట్‌ఫామ్ టికెట్ లేదని విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కే పవన్ కుమార్, యశ్వంత్, భగత్‌సింగ్ తదితరులు ఉన్నారు.

● స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గ ఎన్నికలను నిర్వహించాలని టీడీపీ నాయకుడు బెల్లంకొండ సురేష్ అర్జీ అందజేశారు. ఆగస్టు 18న ఎన్నికలు నిర్వహిస్తామని, జూలై 29న నోటిఫికేషన్ విడుదల చేశారని తెలిపారు. కానీ ఆగస్టు 8న పరిపాలన కారణాల దృష్ట్యా నిలిపివేసినట్టు ఎన్నికల అధికారులు ప్రకటన విడుదల చేశారన్నారు. కలెక్టర్ స్పందించి ఎన్నికల ప్రకియను నిర్వహించేందుకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.



సుశీల మాధవిని సత్కరిస్తున్న ఏఎస్ రామకృష్ణ తదితరులు

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సత్కారం

గుంటూరు (విద్య) సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రాష్ట్ర స్థాయిలో సీఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న వ్యాయామ ఉపాధ్యాయురాలు గుమ్మడి సుశీల మాధవిని మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ సోమవారం సత్కరించారు. స్థానిక పట్టాభిపురంలోని మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విలువలతో కూడిన విద్య బోధించాలని సూచించారు. నోబుల్ టీచర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు, పాఠశాల హెచ్ఎం వీరబాబు, ఉపాధ్యాయులు జె.రమాదేవి, ఏ.హర గోపాల్, సుశీల మాధవి తల్లిదండ్రులు, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నగర నాయకులు పాల్గొన్నారు.

ట్రాన్స్ జెండర్స్‌కు పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

గుంటూరు (విద్య) సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ట్రాన్స్ జెండర్స్‌కు పోటీ పరీక్షల కోసం నైపుణ్యాభివృద్ధి సంస్థ, 21వ సెంచరీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్ స్థాయిలో (370 గంటలు) ఆప్టిట్యూడ్ అండ్ లాజికల్ రీజనింగ్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, కాంపిటీటివ్ ఇంగ్లీష్, బేసిక్ కంప్యూటర్స్, సాఫ్ట్ స్కిల్స్, పబ్లిక్ స్పీకింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా డిగ్రీ స్థాయిలో అడ్వాన్స్ ఆప్టిట్యూడ్, న్యూస్ పేపర్ విశ్లేషణ వ్యక్తిత్వ వికాసం, ఇంగ్లీష్ వేస్సి రైటింగ్, బిజినెస్ కమ్యూనికేషన్, అడ్వాన్స్ కంప్యూటర్స్ తదితర అంశాల్లో సెక్షన్ ఇస్తామని వెల్లడించారు. ఇంటర్ లేదా డిగ్రీ పూర్తి చేసి 18 నుంచి 28 సంవత్సరాలలోపు వయసు ఉన్న వారు ఇందుకు అర్హులని వెల్లడించారు. ఆసక్తి, అర్హత ఉన్న ట్రాన్స్‌జెండర్స్ నిర్దేశించిన సర్టిఫికెట్లు, ఇతర డాక్యుమెంట్స్‌తో బృందావన్‌గార్డెన్స్‌లోని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఆర్థిక బకాయిల విడుదల కోరుతూ 'నిరసన వారం' : ఏపీటీఎఫ్

గుంటూరు (విద్య) సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు రావలసిన ఆర్థిక బకాయిలు చెల్లించటంలో ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ 'నిరసన వారం' పేరుతో ఉద్యమ కార్యాచరణ చేపట్టినట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే.బసవలింగారావు అన్నారు. జిల్లా కోర్టు రోడ్డులోని కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి ఉద్యోగ, ఉపాధ్యాయులకు రివర్స్ పీఆర్సీతో మోసం చేసినట్లే నేటి కూటమి ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీలు 15 నెలలు గడుస్తున్నా బకాయిలు చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు వారం రోజులు పాటు నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు బసవలింగారావు వెల్లడించారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, జిల్లా ఉపాధ్యక్షుడు పి.నాగశివన్నారాయణ, పి.లక్ష్మీనారాయణ, సత్యనారాయణ మూర్తి, జి.దాస్, మునినాయిక్, షకూర్, గురుమూర్తి, కృష్ణారావు, సుబ్బారావు, రాజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బసవలింగారావు

ఏపాసికాన్ 2025లో జీఎంసీ పీజీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మంగళగిరిలోని ఎన్నారై జనరల్ హాస్పిటల్‌లో జరిగిన శస్త్రచికిత్స వైద్యనిపుణుల రాష్ట్ర సదస్సు ఏపాసికాన్ 2025 లో జరిగిన క్విజ్ పోటీలో గుంటూరు వైద్య కళాశాల పీజీ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ బృందంలో డాక్టర్ లోహిత, డాక్టర్ కుసుమ వెంకట రాహుల్‌రెడ్డి, డాక్టర్ పరిటాల లక్ష్మీ ప్రసన్న, డాక్టర్ సానికొమ్ము మణి భార్గవ్ రెడ్డి ఉన్నారు. ఈ విజయంతో గుంటూరు జీఎంసీ రాష్ట్రంలో శస్త్రచికిత్స విద్య, శిక్షణలో అగ్రగామిగా నిలుస్తున్నదని మరోసారి నిరూపితమైనదని జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్వీ సుందరాచారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వి రమణ అభినందనలు తెలిపారు. జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ వై.కిరణ్ కుమార్, డాక్టర్ ఎం.గోవింద్ నాయక్, డాక్టర్ కె.నాగ సంతోష్ కుమార్, డాక్టర్ వినయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

కబ్జాదారుడి నుంచి తమకు, ఫ్లాట్‌లకు రక్షణ కల్పించండి

● ఎస్పీ కార్యాలయంలో బాధితుల ఫిర్యాదు

గుంటూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అపార్ట్‌మెంట్‌లో మా ఫ్లాట్‌లను ఆక్రమించి తమను వేధింపులకు గురి చేస్తున్న రాజ్‌కుమార్, ఆయన కుటుంబ సభ్యులు, ఆయన అనుచరులపై చట్ట ప్రకారం తగు చర్యలు తీసు కుని తమకు, తమ ఫ్లాట్‌లకు రక్షణ కల్పించాలని పలువురు బాధితులు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఈ మేరకు షేక్ కాలేషా వలి, యు.సునీత, అన్నవరపు అమలకుమారి, షేక్ నాగుల్‌మీరా అనే బాధితులు ఆధారాలతో సహా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. హిందూ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న షేక్ కాలేషావలి మాట్లాడుతూ తనకు ఇద్దరు సంతానం ఉన్నారని, వారి భవిష్యత్తు దృష్ట్యా 2017లో భారత్‌పేట ఒకటవ లైన్‌లోని కృష్ణ చైతన్య ఎన్ క్లేవ్‌లో ప్లాటు నెం.101ను కటారి రాజ్ కుమార్ భార్య జొన్నలగడ్డ జయశీల దగ్గర కొని రిజిస్టర్ చేయించుకున్నానన్నారు. అలాగే 2018లో కోడెల రేవతి వద్ద నుంచి ప్లాట్ నెం.302ను నా పేరు, నా భార్య పేరుతో ఉమ్మడి ఆస్తిగా రిజిస్టర్ చేయించుకున్నానన్నారు. అప్పటికే కృష్ణ చైతన్య ఎన్ క్లేవ్‌లో ఉంటున్న కటారి రాజ్ కుమార్ తన స్టడీ సర్కిల్‌కు సంబంధించి స్టూడెంట్స్ ఎక్కువగా ఉన్నారని, అద్దెకు 101, 302 ఫ్లాట్ కావాలని కోరడంతో 2021లో నెలకు రూ.10 వేల చొప్పున అద్దెకు ఇచ్చానన్నారు. 2024 నుంచి అద్దె చెల్లించకపో వటంతో 302 ఫ్లాట్‌ను ఈ ఏడాది జనవరిలో ఖాళీ చేయించానన్నారు.

గత నెలాఖరులో సదరు కటారి రాజ్ కుమార్ కుటుంబాన్ని ఖాళీ చేయించి సదరు 101 ఫ్లాట్ కు తాళాలు వేసుకోవడం జరిగిందన్నారు. ఈ క్రమంలో 31న రాత్రి కటారి రాజ్ కుమార్, అతని భార్య జయశీల, వారి కుమారులు కటారి హేమంత్, కటారి ప్రభాత్, కొందరు గుర్తు తెలియని వ్యక్తులతో సదరు 101 ఫ్లాట్ తాళాలు పగులగొట్టి నా ఫ్లాట్‌ను కబ్జా చేయటమే కాక నా మరో ఫ్లాట్‌లో నేను అద్దెకు ఇచ్చిన వ్యక్తులను రకరకాలుగా ఇబ్బంది పెడుతున్నాడన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే వారు ఫ్లాట్‌ను కబ్జా చేశాం, మళ్లీ ఇటువైపు వస్తే నిన్ను, నీ కుటుంబాన్ని చంపేస్తామని బెదిరిస్తున్నారన్నారు. ఈ క్రమంలో నాకు, నా కుటుంబ సభ్యులకు ప్రాణ హాని ఉందని, రక్షణ కల్పించాలని కోరారు.

మా ఫ్లాట్‌లోకి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారు...

కృష్ణ చైతన్య ఎన్ క్లేవ్‌లో ఫ్లాట్ నెంబర్ 201ని 2015లో కొనుగోలు చేసి ఉంటున్నామని యజమాని యు.సునీత తెలిపారు. గతేడాది ఆగస్టులో ఇల్లు మరమ్మతులు చేయించుకు నేందుకు తాము పొట్టి శ్రీరాములునగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకొని అక్కడికి వెళ్లామన్నారు. ఇప్పుడు మా ఫ్లాట్‌లోకి మేము వెళ్తుంటే రానివ్వకుండా అడ్డుకుంటున్నాడని, 2018 నుంచి ఇప్పటివరకు ఎనిమిదేళ్ళకు నెలకు రూ.వెయ్యి చొప్పున ఆయనకు మెయింటినెన్స్ ఇవ్వాలని బెదిరిస్తున్నాడన్నారు. తన భర్త ప్రభుత్వ ఉద్యోగి అని, దీనిని అలుసుగా తీసుకొని కేసులు పెడతానని బెదిరిస్తున్నాడని బాధితురాలు వాపోయారు.

మా ఫ్లాట్ వేరే వారికి అద్దెకు ఇచ్చుకుని బెదిరిస్తున్నాడు

తాను 2015లో 301వ నెంబర్ ఫ్లాట్ కొనుగోలు చేయగా బిల్డర్ సూచన మేరకు కటారి రాజ్‌కుమార్‌కు ఇంటీరియర్ డెకరేషన్ నిమిత్తం డబ్బులు చెల్లించానని అన్నవరపు అమలకుమారి తెలిపారు. అయితే 2015 మే నెల నుంచి ఫ్లాట్ అప్పగించకుండా వేరే వారికి నెలకు 12 వేల చొప్పున అద్దెకు ఇచ్చుకున్నాడన్నారు. ఫ్లాట్ అయినా మాకు అప్పగించండి, లేదంటే అద్దె అయినా ఇవ్వండి అని అడగడానికి అపార్ట్మెంట్ వద్దకు వెళితే రాజకుమార్, ఆయన భార్య, ఇరువురు కుమారులు తనను దూషించి ఇంటి నుంచి బయటకు గెంటి వేశారన్నారు. ఈ విషయమై తాను అరండల్‌పేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. సీఐ ఆదేశాల మేరకు ఎస్ఐ నరసింహా రావు అపార్ట్మెంట్ వద్దకు వచ్చి విచారిస్తున్న సమయంలో ఆయనపై బెది రింపులకు పాల్పడుతున్నారన్నారు. ఈ విధంగా అన్ని ఫ్లాట్‌ల యజమాను లపై బెదిరింపులకు పాల్పడుతున్నాడని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. అదేమంటే ఎస్సీ, ఎస్టీ కేసు పెడతానని బ్లాక్ మెయిల్ చేస్తున్నాడన్నారు.

నేటి వైసీపీ అన్నదాత పోరుకు అనుమతిలేదు : డీఎస్పీ

గుంటూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి ఎటువంటి అనుమతి లేదని వెస్ట్ ఇన్‌చార్జ్ డీఎస్పీ, ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ స్పష్టం చేశారు. నగరం పాలెం పోలీస్‌స్టేషన్లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ మంగళవారం వైసీపీ తలపెట్టిన అన్నదాత పోరుబాట కార్యక్ర మానికి సంబంధించి ఎటువంటి ముందస్తు అనుమతులు తీసుకోలేదన్నారు. ముందస్తు అనుమతి లేనందున ర్యాలీలు, ధర్నాలు, గుంపులుగా రావడానికి వీలు లేదన్నారు. 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున అనవసరంగా ఈ కార్యక్రమానికి వచ్చి ఇబ్బందులు పడవద్దని ప్రజలను డీఎస్పీ అబ్దుల్ అజీజ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు, అరండల్ పేట సీఐ ఆరోగ్య రాజు పాల్గొన్నారు.

వైసీపీ ముఖ్య నేతలకు నోటీసులు

అన్నదాత పోరు కార్యక్రమానికి అనుమతి లేనందున నాయకులు ఎవరూ ఈ కార్యక్రమానికి రావద్దని పోలీసులు వైసీపీ నేతలకు సోమవారం రాత్రి నోటీసులు జారీ చేసారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఆ పార్టీ నేతలు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, ఆ పార్టీ నేతలు నిమ్మకాయల రాజనారాయణతో పాటు పలువురు నాయకులకు నోటీసులు జారీ చేసారు. అందుబాటులో లేకపోయిన వారి ఇళ్ళకు నోటీసులు అంటించారు. ముఖ్య నేతలతో పాటు ద్వితీయ శ్రేణి నేతలకు నోటీసులు, మౌఖిక హెచ్చరికలు జారీ చేశారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

లిక్కర్ డాన్ల పర్యవేక్షణలో వైసీపీ

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం లిక్కర్ డాన్ల పర్యవేక్షణలో వైసీపీ పని చేస్తోందని, గత ఐదేళ్ల పాలనంతా అవినీతి మాఫియా నడిచిందని తూర్పు ఎమ్మెల్యే నసీర్ విమర్శించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో రూ.1.47 కోట్ల విలువైన సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్థానిక రాఘవనగర్ 1వ లైను, ఆర్టీసీ కాలనీ వద్ద రూ.27.48 లక్షలు, రాఘవనగర్‌లో రూ.32.16 లక్షలు, రైలుపేట రూ.19.04 లక్షలు, అంజుమన్ స్కూల్ వెనుక వైపు రూ.29.27 లక్షలు, లాంచెస్టర్ రోడ్డు రూ.40 లక్షలతో సీసీ డ్రెయిన్లు, సీసీ రోడ్లు, పైపు లైన్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అరాచకం, అవినీతి మినహా రాష్ట్రానికి ఏమీ మిగల్లేదని చెప్పారు. ప్రస్తుతం కూడా లిక్కర్ స్కామ్ ముఠానే ఆ పార్టీలో ఉన్నారని విమర్శించారు. పీపీపీ పద్ధతిలో చేపట్టిన మెడికల్ కాలేజీల నిర్మాణానికి వైసీపీ దుష్ప్రచారం చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. తాము ఎన్నికల సమయంలో అన్ని ప్రాంతంలో పర్యటించామని, అప్పుడు కనీసం రోడ్లు కూడా లేని పరిస్థితి నెలకొందని, ఇప్పుడు ప్రతి రోడ్డునూ సుందరంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు పీ- 4 వంటి గొప్ప కార్యక్రమాన్ని చేపట్టామని వెల్లడించారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాల అమలు ద్వారా ప్రజలకు సంతోషంగా ఉన్నారని తెలిపారు. తాజాగా స్మార్ట్ రేషన్ కార్డులు అందించిన నిత్యావసరాల సరుకుల సరఫరాలో పారదర్శకతకు పెద్ద పీట వేస్తున్నామని చెప్పారు. తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికే వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీలా, అన్వర్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్



డాక్టర్ కత్తెర సురేష్ కుమార్

గుంటూరు సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు రాష్ట్ర ప్రజలకు అందించిన సూపర్ సిక్స్ పథకాలు రాష్ట్రంలో సూపర్ హిట్ అయ్యాయని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ అన్నారు. దేశంలో ఎవరు అమలు చేయని విధంగా అన్ని పథకాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారని అన్నారు. గుంటూరులో సోమవారం ఆయన మాట్లాడుతూ కూటమి ఇచ్చిన మాట తప్పకుండా అమలు చేస్తూ రాష్ట్ర ప్రజల మన్ననలు పొందుతుందన్నారు. వీటిని చూసి ఓర్వ లేక వైసీపీ దుష్ప్రచారం చేస్తుందన్నారు. రూ. లక్ష కోట్లకు పైగా నిధులు వెచ్చించి ప్రజల శ్రేయస్సు ప్రథమ కర్తవ్యంగా ఎన్ని ఒడిదుడుకులు ఉన్నా పథకాలను అమలు చేస్తుందని ప్రశంసించారు. మంచి పాలనను అందిస్తూ ప్రజల మన్ననలను పొందుతున్న చంద్రబాబు రానున్న పదిహేనేళ్ల పాటు సీఎం ఉండాలని ఆకాంక్షించారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి



చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకో వాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ, ఉపాధ్యక్షుడు ఫణీంద్ర డిమాండ్ చేశారు. ప్రభు త్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక కొత్తపేట, భగత్‌సింగ్ విగ్రహం వద్ద చెవిలో పూలు పెట్టుకుని వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. గత ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 107, 108 జీవోలను తీసుకువచ్చి మెడికల్ కళాశాలలో 50 శాతం సీట్లను బి, సి క్యాటగిరీలుగా విభజించి రూ.12 లక్షలకు, రూ.25 లక్షలకు అమ్ముకున్నారని ఆరోపించారు. దీంతో యువగళం పాదయాత్రలో భాగంగా పాత జీవోలను వంద రోజుల్లో రద్దు చేసి ప్రతి మెడికల్ కళాశాలను నూరు శాతం, ప్రభుత్వ కళాశాలలుగా కొనసాగిస్తామని లోకేశ్ హామీ ఇచ్చినట్టు గుర్తు చేసుకున్నారు. ఈ నిరసనల్లో గండు శివ, బందారపు యశ్వంత్, ప్రణీత్, అజయ్, దుర్గా ప్రసాదు, సాయి గణేష్, పవన్, వెంకీ తదితరులు పాల్గొన్నారు

వైభవంగా శ్రీ సత్య సాయి సామూహిక వ్రత మహోత్సవం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీ సత్య సాయి శత జయంతి వేడుకలలో భాగంగా స్థానిక ఏటీ అగ్రహారం ఎంఎస్ఆర్ కల్యాణమండపంలో నిర్వహించిన శ్రీ సత్య సాయి సామూహిక వ్రత మహోత్సవం వైభవంగా నిర్వహించారు. దాదాపు 500 కుటుంబాలు పాల్గొని బ్రహ్మశ్రీ బాలకృష్ణ వేద పండితుని ఆధ్వర్యంలో వ్రతమాచరించారు. ఈ సందర్భంగా బాబా వారి నామసంకీర్తన భక్తులను ఆకట్టుకున్నాయి. సత్య సాయి ఎడ్యుకేషన్ అండ్ సర్వీస్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పీఎల్ నరసింహారావు మాట్లాడుతూ 108 గృహాలలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించిన శ్రీ సత్య సాయి దివ్య నామ సంకీర్తన ముగింపు సందర్భంగా ఈ వ్రతాలని ఆచరించినట్టు తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.కృష్ణ మోహన్ ముఖ్య అతిథిగా హాజరై బాబా ఉద్బోధించిన సేవా కార్య క్రమాల విశిష్టతను వివరించారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ జరిగింది. ఈ కార్యక్రమంలో సత్య సాయి ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయధార్మిక ప్రాంగణంలో భారతీధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో పౌర్ణమి, గ్రహశాంతిని పురస్కరించుకొని సోమవారం విశ్వ శాంతిని కాంక్షిస్తూ చండీహోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులచే 9 మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, రుద్ర, లక్ష్మీగణపతి, చండీ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు.

శతమానం భవతి..!

- మంగళగిరి వైద్య ప్రదాయినిగా వంద పడకల ఆస్పత్రి
- అత్యాధునికి వసతులతో.. శరవేగంగా నిర్మాణ పనులు
- దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచేలా లోకేశ్ ప్రణాళిక

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి):
మంగళగిరి ప్రజల మూడు దశాబ్దాల కల సాకారమవుతోంది. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా... అత్యాధునిక సదుపాయాలతో వంద పడకల ఆసుపత్రి రూపుదిద్దుకుంటోంది. నగరంలోని చినకాకాని వద్ద జాతీయ రహదారి వెంబడి సుమారు 7.35 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆసుపత్రి నిర్మాణ పనులు శర వేగంగా సాగుతున్నాయి. నియోజకవర్గ ప్రజలకు మంత్రి నారా లోకేశ్ ఎన్నిల హామీని నిలబెట్టుకుంటూ.. ఈ ఆసుపత్రి నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. రూ.47.50 కోట్ల వ్యయంతో జీ+1 భవన సముదాయంగా దీనిని నిర్మిస్తున్నారు. భవిష్యత్తులో అంతస్తులను పెంచుకునేందుకు వీలుగా ఫౌండేషన్‌ను పక్కాగా వేస్తున్నారు. 39 ఏళ్లుగా 30 పడకల ఆసుపత్రిగా ఉన్న మంగళగిరి తాలూకా ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. మంగళగిరి ఘాట్ రోడ్డు వెంబడి కొనసాగుతున్న ఆసుపత్రి కార్యకలాపాలను.. నూతన భవనం పూర్తి కాగానే అందులోకి మారుస్తారు. మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీల్లో మంత్రి లోకేశ్ నెరవేరుస్తున్న రెండవ హామీగా దీనిని చెప్పుకోవచ్చు. మొట్ట మొదటిదిగా సాగునీటి సమస్యను పరిష్కరించారు. పెదవడ్లపూడి హైలెవల్ చానల్ వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన ఎత్తిపోతల పథకానికి రూ.10 కోట్లకు పైగా నిధులను విడుదల చేయించి పూర్తిచేయించారు. రెండవదిగా వంద పడకల ఆసుపత్రిని నిర్మిస్తున్నారు.



ఆసుపత్రి భవన సముదాయం (ఊహా చిత్రం)

అత్యాధునికి వసతులు..

ఈ ఏడాది ఏప్రిల్ 13న ఈ ఆసుపత్రి భవన నిర్మాణానికి లోకేశ్ శంకుస్థాపన చేశారు. వచ్చే ఏప్రిల్‌కు దీనిని పూర్తి చేసి ప్రారంభోత్సవం జరుపుకునేలా పనులు యుద్ధప్రాతిపదికన సాగాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి నిర్మాణ వ్యయం రూ 47.50 కోట్లు కాగా, ఇంటీరియర్, ఆసుపత్రి తాలూకు సామగ్రి యావత్తూ కలిపి మరో రూ.50 కోట్లకు పైగా ఖర్చు కాగలదని అంచనా వేస్తున్నారు. అంటే ఈ ఆసుపత్రి రమారమి రూ.వంద కోట్లకు పైగా వ్యయంతో రూపుదిద్దుకుంటోంది. చినకాకాని క్యాన్సర్ ఆసుపత్రి స్థానంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం కొనసాగుతోంది. ఆసుపత్రి ప్రధాన ముఖ ద్వారం ఉత్తరంగా ఉండనుంది. జీ+1 భవన సముదాయం రూపంలో మొత్తం 1,23,632 చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనాన్ని డిజైన్ చేశారు. ఈ ఆసుపత్రి దేశానికే ఓ రోల్ మోడల్‌గా నిలవాలని మంత్రి లోకేశ్ వైద్య ఆరోగ్యశాఖ, ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.

అనుబంధ భవనాలు ఇలా..

మరో ఆరు అనుబంధ భవనాలను నిర్మిస్తున్నారు. ఇవన్నీ 5,511 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటాయి. ఇందులో బయో మెడికల్ వేస్ట్ గది, మార్చురీ భవనం, రోగుల సహాయకుల గది, మెయిన్ ఫోల్డ్ గది, సెక్యూరిటీ బ్లాక్స్, అంబులెన్స్ కోసం షెడ్డు నిర్మిస్తున్నారు. మొత్తం ఆసుపత్రిలో ఇంచుమించుగా 25 మంది వరకు వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉంటారు. ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్‌గా జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు చిల్లపల్లి శ్రీనివాసరావు స్థానికుడే కావడంతో ఆయన ఈ ఆసుపత్రి నిర్మాణ పనుల పట్ల ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తున్నారు. కచ్చితంగా ఏడాదిలోగా ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు.

ఆసుపత్రిలో మెడికల్, సర్జికల్, ఆర్థోపెడిక్, గైనిక్, జనరల్ మెడిసన్, జనరల్ సర్జన్ వంటి అన్నీ ముఖ్యమైన విభాగాలతో పాటు మూడు ఆపరేషన్ థియేటర్లు, డయాలిసిస్ సెంటర్, తలసేమియా వార్డు, డీ అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు.



ప్రధాన భవనానికి సంబంధించిన ఫౌండేషన్ పనులు



ఆసుపత్రి భవనం ఏరియల్ వ్యూ..ఊహా చిత్రం

ఆసుపత్రి ప్రధాన భవనమిలా...

ఆసుపత్రి రెండు రకాల భవంతులతో కూడి ఉంటుంది. ఒకటి ప్రధాన ఆసుపత్రి భవనం, రెండవది అనుబంధ భవనాలు. ప్రధాన ఆసుపత్రి భవనం జీ+1 గా.. 1,18,121 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది. ఇందులో మొదటి అంతస్తు (గ్రౌండు ఫ్లోర్) మొత్తం 58,577 చదరపు అడుగులతో నిర్మితమవుతోంది. ఇందులో ఎంట్రన్స్ లాబీ, ఓబీజీ అండ్ గైనిక్, కుటుంబ నియంత్రణ, పీడియాట్రిక్స్, డెంటల్ అండ్ స్కిన్ (ఓపీడీ), క్యాజువాలిటీ, ఎల్‌డీఆర్ యూనిట్, మెడికల్ అండ్ సర్జికల్, నేత్ర, సైక్రియాట్రీ (ఓపీడీ), రేడియాలజీ, ఫిజియోథెరపీ, ఐసీటీసీ అండ్ టీబీ సెంటర్, ఆయూష్ (ఓపీడీ), డైక్, కిచెన్ అండ్ స్టోర్, పెథాలజీ, సెంట్రల్ ల్యాబ్, సెంట్రల్ ఫార్మసీ, ఆర్థోపెడిక్ (ఓపిడి), రిజిస్ట్రేషన్, ఎలక్ట్రికల్ రూం, తలసేమియా వార్డు, డయాలిసిస్, డాక్టర్స్ లాంజ్ అండ్ స్టాఫ్ లాంజ్ ఏర్పాటవుతాయి. రెండవ అంతస్తులో ఓటీ కాంప్లెక్స్, ఒక్కోటి 15 పడకలతో కూడిన ఆరు వార్డులు, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసన్, ఓటీజీ, గైనకాలజీ, పెడియాట్రిక్స్, ఆర్థోపెడిక్, ఎంఎన్‌సీ వార్డు, ఎస్ఎన్‌సీయూ అండ్ ఎన్ఐసీయూ వార్డులు, క్రిటికల్ కేర్ యూనిట్లు, ఎన్‌బీఎస్‌యూ అండ్ స్టోర్స్, ఐసోలేషన్ వార్డు, పే రూములు (5), పరిపాలన విభాగం, బ్లడ్ స్టోరేజి తదితర విభాగాలను ఏర్పాటు చేస్తారు. ఇవిగాక టెర్రస్ ఫ్లోర్‌లో మరో 3,119 చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులో ఉంటుంది.

మండు టెండలతో..
విద్యుత్ వినియోగం పైపైకి..

- రోజువారీ కోటాను దాటుతున్న విద్యుత్ వాడకం

గుంటూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతోన్న మండుటెండలు ఏప్రిల్, మే నెలలను తలపిస్తున్నాయి. మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో విద్యుత్ వినియోగం పీక్‌కి చేరుతోంది. సాధారణ కోటా కంటే అదనంగా విద్యుత్ వాడకం జరుగుతోందని అధికారులు గణాంకాలతో తెలియజేస్తున్నారు. గుంటూరు సర్కిల్ పరిధిలోని గుంటూరు, తెనాలి డివిజన్‌లలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. గత నెలలో 6 మిలియన్ యూనిట్ల వినియోగం లోపల మాత్రమే ఉంటే.. ఇప్పుడు దాని మించి వినియోగం జరుగుతోంది. వాస్తవానికి విభజిత గుంటూరు సర్కిల్‌కు రోజువారీ కోటాగా 6.008 మిలియన్ యూనిట్లు కాగా 6.426 మిలియన్ యూనిట్లు వినియోగిస్తున్నట్లు గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్ తెలిపారు. అలానే గుంటూరు సర్కిల్‌తో పాటు బాపట్ల, పల్నాడు సర్కిల్స్‌లో కూడా అదే స్థాయిలో విద్యుత్ వినియోగం పెరుగుతోందని అధికార వర్గాలు తెలిపాయి. ఎండలతో ప్రధానంగా మధ్యాహ్నం, రాత్రిళ్లు వాడకం అధికంగా ఉంటోందని చెబుతున్నారు. అసలే మండుతోన్న ఎండలు ఉక్కపోతతో ఊపిరాడక చిన్నారుల నుంచి పెద్దల వరకు అల్లాడిపోతున్నారు. దాంతో ఫ్యాన్లు, ఏసీలకు, ఎయిర్ కూలర్లను ఎడా పెడా వాడుతోన్నారు. తాజాగా విద్యుత్ వినియోగం చూస్తుంటే సమ్మర్ సమయంలో విద్యుత్ వినియోగం జరిగినట్లుగా ఉందని అధికారులు చెబుతున్నారు. విద్యుత్ వినియోగం పీక్ స్థాయిలో ఉండటంలో అక్కడక్కాడా విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్న ఫిర్యాదులు వస్తున్నాయి. అర్ధరాత్రులు, మధ్యాహ్నం సమయాల్లో ఉన్నట్టుండి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు రావడం కూడా పెరిగాయని చెబుతున్నారు. విద్యుత్ వినియోగం పెరిగిన నేపథ్యంలో సెక్షన్ స్థాయిలో అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు ఎస్ఈ రమేష్ తెలిపారు.

వందశాతం..
మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్ల సమయపాలన

- ఐదు నెలల్లో 14 రోజుల పాటు సాధించి.. రికార్డు
- గుంటూరు ఆపరేటింగ్ విభాగానికి అభినందనల వెల్లువ

గుంటూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లను గత ఐదు నెలల్లో 14 రోజుల పాటు 100 శాతం సమయపాలనతో నడిపి గుంటూరు రైల్వే డివిజన్ ఆపరేటింగ్ విభాగం సరికొత్త రికార్డుని సృష్టించింది. డివిజన్‌లో కొంతభాగం సింగిల్ లేన్ రైలు మార్గం ఉన్నప్పటికీ ఆ అవరోధాన్ని అధిగమించి.. తనకు కేటాయించిన టైం షెడ్యూల్‌లో రైళ్లను నడిపింది. నిర్ణీత సమయానికి ఇటు వైపున తెనాలి, కృష్ణా కెనాల్, అటువైపున పగిడిపల్లి, నంద్యాల చేంజ్ వోవర్ల వద్ద ఇతర డివిజన్లకు రైళ్లను అప్పజెప్పింది. దీనిపై గుంటూరు ఆపరేటింగ్ విభాగం అధికారులు, సిబ్బందిని డివిజనల్ రైల్వే వర్గాలు, రైల్వే యూజర్స్ అసోసియేషన్ నాయకులు అభినందిస్తున్నారు.

● దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో ఏప డివిజన్‌లు 100 శాతం సమయపాలన సాధించాయనే వివరాలను విడుదల చేసింది. పొరుగున ఉన్న గుంతకల్లు డివిజన్ కేవలం ఐదు రోజులు మాత్రమే ఈ లక్ష్యాన్ని సాధించగా గుంటూరు రైల్వే డివిజన్ ఏప్రిల్‌లో 9, 22, మేలో 11, 12, జూన్‌లో 13, జూలైలో 7, 9, 13 ఆగస్టులో 4, 6, 21, 24, 25 29 తేదీల్లో తనకు కేటాయించిన షెడ్యూల్ ప్రకారం మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లను గమ్యస్థానాలకు చేర్చింది. ఇతర డివిజన్‌లలో చాలా వరకు డబుల్ లేన్ రైలు మార్గాలున్నాయి. గుంటూరు డివిజన్‌కు వచ్చేసరికి తెనాలి - రేపల్లె, నల్లపాడు - పగిడిపల్లి, పిడుగురాళ్ల - వినుకొండ మధ్యన సింగిల్ లేన్ ట్రాక్‌లున్నాయి. అయినప్పటికీ ఈ అడ్డంకులను ఆపరేటింగ్ విభాగం అధిగమించింది.

● ప్యాసింజర్ రైళ్ల విషయంలోనూ గుంతకల్లు డివిజన్ నూరు శాతం సమయపాలన సాధించడం వలన ఆ డివిజన్ టాప్‌లో నిలిచింది. గుంటూరు డివిజన్ విషయానికి వచ్చేసరికి ప్యాసింజర్ రైళ్లను నిర్ణీత వ్యవధిలో గమ్యస్థానాలకు చేర్చలేకపోయింది. ఇందుకు కారణం సింగిల్ లేన్ ట్రాక్‌లో ఎదురుగా వచ్చే ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్టు రైళ్ల కోసం ప్యాసింజర్ రైళ్లను లూప్‌లైన్‌లో పెట్టాలి. అలానే వెనక వచ్చే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రిసిడెన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ కారణంగా ప్యాసింజర్ రైళ్ల విషయంలో సమయపాలన లక్ష్యాన్ని అధిగమించలేకపోయింది.

14 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల



14 క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి వరద నీరు అధికంగా వచ్చి చేరుతుండడంతో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులు 14 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం నాటికి 589.20 అడుగులు ఉంది. ఇది 309.65 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,700, ఎడమ కాలువ ద్వారా 9,166, 14 క్రస్ట్‌గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,12,224, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,658, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 1,67,448 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 1,67,448 క్యూసెక్కులుగా ఉంది.

పులిచింతలకు 1,23,369 క్యూసెక్కుల నీరు

రెంటచింతల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్ట్‌కు చెందిన 20 రేడియల్ క్రస్ట్‌గేట్లకు గాను.. 9 గేట్లను 2.50 మీటర్ల మేర ఎత్తి పులిచింతలకు 1,15,317, విద్యుత్ ఉత్పత్తి అనంతరం టెయిల్ రేస్ ఛానల్ ద్వారా 8052, మొత్తంగా 1,23,369 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. సాగర్ నుంచి 1,45,882 క్యూసెక్కుల నీరు వస్తున్నాందన్నారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 0.8242 ఎంయూల విద్యుత్ ఉత్పత్తి అయ్యిందని తెలిపారు. రిజర్వాయర్‌లో 75.48 మీటర్ల మేర నీరు ఉండగా ఇది.. 6.963 టీఎంసీలకు సమానమన్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద పెరిగిన వరద ఉధృతి



బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న వరద నీరు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి పెరిగింది. పులిచింతల ప్రాజెక్టుతో పాటు కీసర, మున్నేరు, వెలగలేరు, తదితర ప్రధాన వాగుల నుంచి 1,45,714 క్యూసెక్కుల వరద నీరు సోమవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్లు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం నమోదు అవుతుండగా దిగువకు 1,26,975 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టా కాలువకు 10,276, పశ్చిమ డెల్టాకు 8,216, గుంటూరు ఛానల్‌కు 247 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు.

కూటమి 'బీమా'..
ఆరోగ్యానికి ధీమా..!

సత్తెనపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన యూనివర్సల్ హెల్త్ పాలసీతో పేదల వైద్య కష్టాలు తీరనున్నాయి. ఈ పాలసీతో పేద, మధ్య తరగతి ప్రజలు కార్పొరేట్ ఆస్పత్రి మెట్లెక్కేందుకు అవకాశం కలగనుంది. ప్రతి కుటుంబానికి రూ.25 లక్షలు ఆరోగ్య బీమా వర్తించేలా రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించింది. ఈ సొమ్ముతో 3,257 చికిత్సలు ఉచితంగా పొందేందుకు అవకాశం కలుగుతుంది. ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి ఆరోగ్య బీమా దక్కనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌టీఆర్ వైద్య సేవా పథకం ద్వారా రూ.2.50 లక్షలు, కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.5 లక్షలు వైద్య ఖర్చులకు అందిస్తోంది. ఇంతకు మించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇప్పటి వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వైద్య సేవలన్నీ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు మాత్రమే అందేవి. ఇది కూడా కొన్ని రకాల వ్యాధులకు మాత్రమే. కూటమి ప్రభుత్వం తీసుకు వచ్చిన పాలసీలో అన్ని రకాల చికిత్సలు ఉన్నాయి. వర్కింగ్ జర్నలిస్టులనూ ఇందులో చేర్చారు. అన్ని వర్గాలకు హెల్త్ పాలసీని వర్తింపజేయనున్నారు.

ఆరు గంటల్లోనే వర్తింపు

సాధారణ జ్వరంతో ఆస్పత్రికి వెళ్తే.. డాక్టర్ ఫీజు, మందులు, రక్త పరీక్షలతో కనీసం రూ.5వేలు ఐనా ఖర్చు అవుతుంది. ఇక ఆపరేషన్‌లకు ఐతే రూ.లక్షల్లోనే ఆ ఖర్చు ఉంటుంది. ఆస్పత్రిలో ఉండేందుకు గదికి రూ.3వేలు నుంచి రూ.10వేలు వరకు అద్దె వసూలు చేస్తున్నారు. రోగితో మాట్లాడిన తరువాత చీటి పై రాసిన పరీక్షలకు రూ.5వేలు నుంచి రూ.20వేలు వరకు ఖర్చు చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ తరువాత అయ్యే ఖర్చు చెప్పలేం. కుటుంబానికి జీవనాధార మైన ఇంటి పెద్ద అర్ధంతరంగా మంచం పట్టడమో, ప్రాణాలు కోల్పోవడమో జరిగితే.. ఆ కుటుంబం వీధినపడినట్లే.. వైద్య ఖర్చులకే లక్షలాది రూపాయలు ఖర్చు చేయలేక పేద, మధ్య తరగతి ప్రజలు చితికి పోతున్నారు. ఇప్పుడు ప్రతి పది మందిలో ముగ్గురు షుగర్, బీపీ వ్యాధితో బాధ పడుతున్నారు. రెండు వ్యాధులు ఉన్న వారు వివిధ రకాల పరీక్షలు చేయించుకోవాలి. దీర్ఘ కాలిక వ్యాధులు కావడంతో.. చికిత్సకు మందులు వాడాల్సి వస్తుంది. పిల్లల చదువుకు ఖర్చుతో పాటు అనారోగ్యానికి గురైతే రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తుంది. సంపాదించిన దానిలో సగం ఆస్పత్రులకు పోస్తున్నారు. ఈ పరిస్థితిని తప్పించేందుకు కూటమి ప్రభుత్వం రూ.25 లక్షల బీమాను తీసుకొస్తోంది. ఆస్పత్రిలో చేరిన ఆరు గంటల్లోపే హెల్త్ పాలసీ అమల్లోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

ఉద్యాన వికాసం.. రాయితీ సహకారం!

- ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం పోత్సాహం
- ఉపాధి హామీ పథకం అనుసంధానంతో.. ఆర్థిక తోడ్పాడు
- ఐదేళ్లకు ప్రణాళిక...క్షేత్రస్థాయిలో అవగాహన
- ఔత్సాహిక రైతుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

వేమూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు అనేక విధాలుగా ఐదేళ్ల సాయం అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. కేంద్ర ప్రభుత్వ పథకాన్ని అనుసంధానం చేసి రైతులకు లబ్ధి చేకూర్చే విధంగా రాయితీలను ఇప్పటికే ప్రకటించింది. ఉపాధి హామీ పథకం ద్వార ఆర్థిక సాయం అందించేందుకు శ్రీకారం చుట్టింది. మొక్కలను తక్కువ ధరకు అందించడంతో పాటు ఖర్చులను కొంతమేర భరించనుంది. దీంతో రైతు తక్కువ ఖర్చుతో పంటలు పండించే వెసులుబాటు ఏర్పడింది. మొక్కలు, యంత్రాలు సరఫరా చేయడంతో పాటు తీగ మొక్కలకు పందిళ్ల ఏర్పాటు, పండ్లు, కాయల రవాణా కోసం.. సోలార్ డ్రైయర్స్, ప్యాకింగ్ ప్యాకెట్‌లను కూడా అందిస్తోంది. నిమ్మతోటల పునరుద్ధరణకు ప్రోత్సాహకాలు, సాగు పద్ధతులపై రైతులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ప్రారంభించింది. ఉపాధి నిధుల నుంచి అర్హులైన రైతులకు పండ్ల తోటల పెంపకం కోసం వంద శాతం రాయితీ అందిస్తోంది. వీటిపై సచివాలయాల్లోని ఉద్యాన శాఖ ఉద్యోగుల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తోంది. తద్వారా ఇప్పటికే తగిన సౌకర్యం ఉన్న అనేక మంది రైతులు ఉద్యాన పంటల సాగుకు ముందుకు వస్తున్నారు.



నిమ్మతోట రైతులకు సూచనలు ఇస్తున్న అధికారి(ఫైల్‌పాటో)

రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఉద్యాన పంటల సాగుకు సంబంధించిన రాయితీలు పొందేందుకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఉద్యాన శాఖ వేమూరు నియోజకవర్గ అధికారి కల్యాణ చక్రవర్తి తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా రాయితీలు పొందేవారు మండల పరిషత్ కార్యాలయాల్లో ఉపాధి విభాగం అధికారులను సంప్రదించాలన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో పలువురు రైతులు రాయితీలను అందుకుని.. పూల తోటలు, కూరగాయల పందిళ్ల, పసుపు, బొప్పాయి, అరటి, నిమ్మ ఇతర కూరగాయల పంటల సాగు ప్రారంభించారని తెలిపారు. గ్రామ సచివాలయాల పరిధిలో ఉద్యానవన శాఖ విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, నిబంధనల మేరకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.



రాయితీపై వేసిన పసుపు అంతర్ పంటగా బొప్పాయి

ఉద్యాన పంటలపై రాయితీలు ఇలా..

- పసుపు విత్తనం నాటుకునేందుకు ఎకరాకు రూ.9,800 రాయితీ సొమ్మును రైతుల బ్యాంకు ఖాతాకు జమ చేస్తుంది.
- టిష్యూ కల్చర్ రెండేళ్ల కాల పరిమితితో అరటి మొక్కలు నాటుకునేందుకు రెండున్నర ఎకరాకు రూ.70 వేలు చొప్పున రాయితీ కల్పిస్తోంది. హైదరాబాద్, అనంతపూర్, వైఎస్సార్ యూనివర్శిటీల ద్వారా మొక్కలను సరఫరా చేస్తోంది.
- బొప్పాయి పంటలు వేసే రైతులకు రెండున్నర ఎకరాలకు రూ.28 వేలు రాయితీ అందిస్తోంది.
- హైబ్రీడ్ కూరగాయల పెంపకానికి రెండున్నర ఎకరాలకు రూ.24 వేల రాయితీ ఇస్తోంది. ఇదే విధంగా పూల తోటల పెంపకానికి రూ.20 వేలు రాయితీని ప్రకటించింది.
- తీగ జాతి కూరగాయల పెంపకానికి.. శాశ్వత పందిళ్ల నిర్మాణం కోసం రెండున్నర ఎకరాలకు రూ.2.50 లక్షల రాయితీ ఇవ్వనుంది.
- సోలార్ డ్రైయర్స్ 100 కేజీల కెపాసిటీ కలిగిన ఒక డ్రైయర్‌కు రూ.3.50 లక్షలు ఖర్చు అవుతుంది. ఇందుకు రూ.1.50 లక్షలు రాయితీని అందించనుంది.
- పొలంలోని కాయలను రవాణా చేసే ముందు ప్యాకింగ్ గ్రేడింగ్, వాషింగ్ నిమిత్తంగా రూ.4.50 లక్షలు విలువ కలిగిన ప్యాకెట్‌ను రూ.2.50 లక్షల రాయితీపై సరఫరా చేయనుంది.
- యాంత్రీకరణ ద్వారా రూ.10 వేలు విలువ కలిగిన బ్యాటరీ స్ప్రేయర్లను రూ.5 వేల రాయితీకి ఇవ్వనుంది. రూ.20 వేలపైన విలువ కలిగిన మోటార్ ఇంజన్లకు రూ.10 వేలు రాయితీ ప్రకటించింది.
- ఉపాధి నిధుల ద్వారా 14 రకాల పంటలు పండించేందుకు 100 శాతం రాయితీ కల్పించింది.
- నిమ్మ తోటల పునరుద్ధరణ పథకం ద్వారా బాగా దెబ్బతిన్న, చనిపోయిన నిమ్మ మొక్కల స్థానంలో కొత్త వాటిని నాటుకునేందుకు ఎకరాకు రూ.9,800 రాయితీ ఇవ్వనుంది.

స్వర్ణ పంచాయతీకి శ్రీకారం!

- గ్రామాల్లో ఇంటి పన్ను వివరాల డిజిటలైజేషన్
- కొలిక్కి వస్తున్న ఆన్‌లైన్ ప్రక్రియ
- యాప్‌లో ఎడిట్ ఆప్షన్లపై యంత్రాంగం కసరత్తు
- నిధుల మళ్లింపునకు ఇక చెక్!

(బాపట్ల, ఆంధ్రజ్యోతి):
పంచాయతీకి పన్నుల రూపంలో వస్తున్న రాబడి ఎంత? వివిధ పనుల కోసం ఖర్చుపెడుతున్నది ఎంత?.. అనే వివరాలు ఇన్ని రోజులు బేతాళ రహస్యం గానే మిగిలిపోయాయి. జవాబుదారీతనానికి అవకాశం లేకుండా ప్రక్రియలో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకుని ఇష్టారీతిన పంచాయతీ నిధులను కైంకర్యం చేసిన దాఖలాలు కోకొల్లలు. తిలా పాపం తలా పిడికెడు అన్న చందాన ఈ వ్యవహారాల్లో పంచాయతీ సిబ్బంది మొదలుకుని సర్పంచ్‌ల వరకు అందరి భాగస్వామ్యంతోనే అవకతవకలు జరిగేవి. తాము ఇంటి పన్ను సరిగానే చెల్లిస్తున్నట్లు యజమానులు చెబుతుంటే.. ఆ నిధులు మాత్రం పంచాయతీ ఖాతాల్లో కనిపించేవి కావు. అనేక పంచాయతీల్లో ఈ నిధులు దారి మళ్లాయి. కొన్ని చోట్ల విచారణ జరగ్గా అక్రమాలు నిజమని నిరూపితమవడంతో పంచాయతీ సిబ్బందిపై చర్యలు, సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు నిర్ణయాలు కూడా జిల్లాలో గతంలో తీసుకోవడం జరిగింది. కానీ, ఈ చర్యలేవీ నిధుల అవకతవకలకు అడ్డుకట్ట వేయలేకపోయాయి. వీటన్నింటికి విరుగుడుగా గ్రామాల్లో ఇంటి పన్ను వివరాలు మొదలుకుని, పంచాయతీ పరిధిలో ఖర్చు పెట్టే ప్రతి పైసా.. వివిధ పథకాల ద్వారా వచ్చే నిధులు మొత్తం ఇక నుంచి ఆన్‌లైన్‌లో నమోదు జరిగేలా ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ విధానాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇంటి పన్ను ఆన్‌లైన్ చేయడంతో పాటు యజమాని ఆధార్ అనుసంధానం కూడా ఈ విధానంలో చేస్తున్నారు. ఇకపై ఇంటి పన్నును ఆన్‌లైన్‌లోనే చెల్లించే వెసులుబాటును ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ మొత్తం ప్రక్రియ ప్రారంభమై రెండు నెలలు కాగా ఇప్పటికి దాదాపు 90 శాతం డిజిటలైజేషన్ పూర్తి అయినట్లు సమాచారం. స్వర్ణ పంచాయతీ యాప్‌లో ఎడిట్ ఆప్షన్లకు సంబంధించి కొంత కసరత్తు మిగిలి ఉందని.. త్వరలోనే పూర్తి స్థాయిలో దీని వినియోగానికి శ్రీకారం చుట్టడం జరుగుతుందని డీపీవో ప్రభాకరరావు తెలిపారు



పర్చూరు మండలంలోని నాగులపాలెం పంచాయతీ కార్యాలయం

దారిమళ్లిన పంచాయతీ నిధులు..

బాపట్ల జిల్లా వ్యాప్తంగా 459 పంచాయతీలు ఉండగా ఇంటి పన్నుకు సంబంధించి ఏటా ఆదాయం దాదాపు రూ.19 కోట్ల వరకు పంచాయతీ ఖాతాలకు జమ కావాల్సి ఉంది. కానీ గడచిన ఐదేళ్ల ఏలు బడిలో 50 శాతం నిధులు కూడా జమ కాకపోగా నిధులు ఇష్టారీతిన దారి మళ్లించారు. తాము ఇంటి పన్ను కట్టి రశీదు తీసుకున్నప్పటికీ, రికార్డుల్లో కట్టలేదని చూపిస్తున్నారనే ఫిర్యాదులు వైసీపీ ఏలుబడిలో దాదాపు 800 వరకు వచ్చాయి. పెండింగ్ ఉన్నదెంత, వాటి వసూలుకు చేపడుతున్న చర్యలేంటి . ఇలా దేనికీ పంచాయతీల వద్ద సమాధానం ఉండేది కాదు. ప్రభుత్వం తీసుకొస్తున్న స్వర్ణ పంచాయతీల విధానంతో ఇక ముందు ఆన్‌లైన్‌లో పూర్తి పారదర్శకంగా వివరాలు లభించనున్నాయి. పంచాయతీల పరిధిలో ఇంటి పన్నుల రూపంలో వసూలు కావాల్సింది, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బకాయిల వివరాలు ఇలా సమగ్రంగా యాప్ వేదికగా దర్శనమివ్వనున్నాయి

90 శాతం ప్రక్రియ పూర్తి

ఇంటి పన్ను వివరాల డిజిటలైజేషన్‌తో పాటు ఆధార్ అనుసంధాన ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా 90 శాతం పూర్తి కాగా సాంకేతికపరమైన చిక్కులతో కొన్ని పంచాయతీల్లో ప్రక్రియ ఇంకా కొలిక్కి రాలేదు. వాటి విషయంలో ఉన్నతాధికారులకు ఆదేశాల మేరకు నడుచుకుంటామని యంత్రాంగం చెబుతోంది. త్వరలోనే స్వర్ణ పంచాయతీ యాప్ వేదికగా డిజిటల్ లావాదేవీలకు శ్రీకారం చుట్టనున్నారు. ఇంటి పన్ను మొదలుకుని పంచాయతీకి చెల్లించే మొత్తాలన్నీ ఇకపై నగదు రూపంలో కాకుండా ఆన్‌లైన్ ద్వారానే జరిపేలా ప్రజలకు అవగాహన కూడా కల్పించనున్నారు. ఈ యాప్ ద్వారా ప్రజలు నేరుగా తాము చెల్లించిన పన్ను ప్రభుత్వ ఖాతాకు జమ అయిందా లేదా అనే వివరాలు చూసుకోవచ్చని, ఏమైనా అభ్యంతరాలుంటే స్వర్ణ పంచాయతీ యాప్‌లోనే ఫిర్యాదు చేసే విధంగా అవకాశం కల్పించారు. ప్రస్తుతం వీటికి సంబంధించి ఎడిట్ ఆప్షన్లపై కసరత్తు జరుగుతోంది. త్వరలోనే యాప్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

అవకతవకలకు చెక్ పడేనా..

జిల్లా వ్యాప్తంగా దాదాపు 18 పంచాయతీల్లో గత ప్రభుత్వంలో అడ్డగోలుగా నిధుల దుర్వినియోగం జరిగినట్లు నిగ్గు తేల్చిన జిల్లా పంచాయతీ విభాగం ఇటీవలే ఆరుగురు పంచాయతీ కార్యదర్శులపై వేటు వేయడంతో పాటు ఇద్దరు సర్పంచ్‌ల చెక్ పవర్‌ను కూడా రద్దు చేసింది. త్వరలోనే మరికొంత మందిపై వేటు పడనుందని సమాచారం. పంచాయతీల్లో జరిగే లావాదేవీల్లో 90 శాతం ఆన్‌లైన్ వేదికగానే జరిగేలా చూడడమే స్వర్ణపంచాయతీల ప్రధాన ఉద్దేశ్యమని, తద్వారా నిధుల దుర్వినియోగానికి చెక్ పడనుందని ప్రభుత్వం చెబుతోంది.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

అన్ని రైతు కేంద్రాల్లో యూరియా లభ్యం: ఏడీఏ రామకోటేశ్వరి

చేబ్రోలు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గురువారం నుంచి మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి అన్నారు. సోమవారం రెండో నెంబర్ సచివాలయం వద్ద రైతుల చెంతకే యూరియా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో సుమారు 1200 మెట్రిక్ టన్నుల యూరియా ఇప్పటికే అందజేసినట్లు వెల్లడించారు. రైతులు చౌకగా యూరియాను సేవా కేంద్రాల్లోనే పొందాలని, వ్యక్తిగత దుకాణాల వద్ద అధిక ధరలకు కొనవద్దని సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా ఎరువుల నిల్వలు గమనించినట్లయితే వెంటనే వ్యవసాయశాఖకు సమాచారం ఇవ్వాలన్నారు. అధిక యూరియా నిల్వ ఉంచిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆరోగ్య శాఖాధికారుల తనిఖీలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆహార పదార్థాలు విక్రయించే దుకాణాలను ఆరోగ్య శాఖాధికారి మొవ్వా యేసుబాబు సోమవారం తనిఖీ చేశారు. మారీసుపేట, శివాజీ చౌక్ తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్న స్వీట్, బజ్జీ అంగళ్లను, టిఫిన్ బండ్లను పరిశీలించారు. ఆహార తయారీలో జాగ్రత్తలు పాటించాలని, ఈగలు వాలకుండా చూడాలని లేకుంటే ప్రజలు అనారోగ్యం బారిన పడతారని చెప్పారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జీఎస్టీ తగ్గింపుతో అన్ని రంగాలకు మేలు: గోవాడ

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గించి పేదల పక్షపాతిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి నిరూపించుకున్నారని భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడు గోవాడ వెంకటకృష్ణారావు అన్నారు. సోమవారం స్థానిక బీజేపీ కార్యాలయం సమీపంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో దేశ ప్రజలకు దసరా, దీపావళి ముందుగానే వచ్చిందని హర్షం వ్యక్తంచేశారు. జీఎస్టీ తగ్గింపు వల్ల సామాన్యుడు వినియోగించుకునే నిత్యావసరాల నుంచి మధ్యతరగతి ప్రజలు వినియోగించుకునే అన్ని వస్తువులపై ధరలు తగ్గి ప్రజల జీవన ప్రమాణాలు పెరిగే అవకాశం ఉందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రదాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

తెనాలి క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవిత బీమా, ఆరోగ్య బీమా పాలసీపై జీఎస్టీని పూర్తిగా మాఫీచేయడం వలన అన్ని వర్గాల వారికి లబ్ధి చేకూరుతుందని ఎల్‌ఐసీ, ఇతర బీమా సంస్థల ఉద్యోగులు, ఏజెంట్లు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం గాంధీ చౌక్, మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఈ సంస్థల పట్టణ నాయకులు మాట్లాడుతూ, 56వ జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం జీవిత, ఆరోగ్య బీమా పాలసీలపై జీఎస్‌టీ పూర్తిగా రద్దు చేయడం వలన బీమా పొందే కుటుంబాల సంఖ్య విస్తరిస్తుందని, గ్రామీణ, మధ్యతరగతి వారికి ఇది ఎంతగానో మేలు చేకూరుతుందన్నారు. పాలసీదారుల్లో ఆర్థిక భద్రతాభావం నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో మాలేపాటి నరేష్, జగదీష్, వెంకటరెడ్డి, వెంకటేశ్వరరావు, రాజశేఖర్, ఉమామహేశ్వరరావు, ప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత పోరుబాటను విజయవంతం చేయాలి

● వైసీపీ మండల అధ్యక్షుడు వెంకటప్పారెడ్డి

కొల్లిపర, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్నదాత పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ మండల అధ్యక్షుడు కల్లం వెంకటప్పారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపర వైసీపీ కార్యాలయంలో వైసీపీ నాయకులతో కలిసి ఆయన అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటప్పారెడ్డి మాట్లాడుతూ రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రైతు సమస్యలపై మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో 9వ తేదీన ఉదయం తెనాలి రావలింగేశ్వరపేటలో ఏ 1 కన్వెన్షను హాలు నుంచి ప్రదర్శనంగా వెళ్ళి సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు భీమవరపు శివకోటిరెడ్డి, అవుతు సాంబిరెడ్డి, పిల్లి గంగాధర్, మండ్రు రాజు, మల్లోల రవి, అరిమండ కృష్ణారెడ్డి, అరిమండ మహేంద్రరెడ్డి, అవుతు శ్రీనుశేఖర్‌రెడ్డి, షేక్ అబ్దుల్లా పాల్గొన్నారు.

'ఉద్యోగులకు అదనపు భారాన్ని తగ్గించాలి'

కొల్లిపర, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగులుగా పని చేస్తున్న సిబ్బందికి ఆదనపు భారాన్ని తగ్గించాలని సచివాలయం ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండికళ్ళ సతీష్ అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపరలో సచివాలయం ఉద్యోగులు తమ సమస్యలపై వినతి పత్రాన్ని తహసీల్దార్ సిద్ధార్థకు, ఎంపీడీవో విజయలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ గతంలో వలంటీర్లు పనిచేసే క్లస్టర్లను సచివాలయం సిబ్బందికి బదలాయించడం అన్యాయమన్నారు. వివిధ రకాల సర్వేల వల్ల సచివాలయం ఉద్యోగులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందన్నారు. సెలవు దినాల్లో సర్వేలను చేయించడం వలన సచివాలయ ఉద్యోగులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. స్పష్టమైన జాబ్‌చార్ట్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్లు దీనరాజు, డాక్టర్ రాజేష్ నాయుడు, పణేంద్ర, ప్రదీప్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు అరుణ్‌బాబు, భరత్, వెల్ఫేర్ అసిస్టెంట్లు కారుమంచి సుబ్బారావు, కె. ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పల్లెల్లో ఆరోగ్య కేంద్రాలు

ములుకుదురు గ్రామంలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న ఆరోగ్య కేంద్రం

● నిర్మాణానికి రూ. 8.15 కోట్లు మంజూరు
● గ్రామాల్లో అందుబాటులోకి రానున్న వైద్యం

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పేదలకు గ్రామాల్లోని సరైన వైద్యం అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కానీ గత దశాబ్దాలుగా గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలు కానీ, ప్రభుత్వ వైద్యశాలలు ఏర్పాటు సక్రమంగా జరగకపోవడం వలన ప్రభుత్వ లక్ష్యాలు నీరుగారిపోయాయి. గతంలో పొన్నూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాలు నిర్మించి ప్రజలకు కొంతమేర వైద్యం అందుబాటులోకి తీసుకు వచ్చినప్పటికీ సరైన సౌకర్యాలు లేక గ్రామాల్లో వైద్యం అందని పరిస్థితులు ఏర్పడ్డాయి. గత ఐదేళ్లుగా గ్రామీణ వైద్యంపై గత ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో సమస్యలు ఎప్పటికప్పుడు పెరిగిపోయాయి. స్థానికంగా విష జ్వరాలు వచ్చినా, ప్రాథమిక చికిత్సలు అవసరమైన పల్లెవాసులు పొన్నూరు పట్టణం వైపు వైద్యంకోసం రావాల్సిన పరిస్థితి. వైద్యశాలలు ఉన్నప్పటికీ సరైన మౌలిక వసతులు లేకపోవడం సొంత భవనాలు సమకూర్చకపోవడం, వైద్యశాలల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచకపోవడం వంటి అనేక సమస్యలతో గ్రామీణ వైద్యం పేదలకు అందనంత దూరంగా మారింది. అంతేకాకుండా వైద్యశాలలకు వచ్చే రోగులకు అవసరమైన మందులు కూడా అందుబాటులో ఉంచకపోవడం, సిబ్బంది కొరత గ్రామీణ వైద్యశాలలకు అవరోధంగా మారాయి. గత ఎన్నికల సమయంలో గ్రామీణ వైద్య దుస్థితిపై అనేక గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ దృష్టికి తీసుకువచ్చారు. ఎన్నికల సందర్భంగా గ్రామీణ ప్రాంతంలో వైద్యశాలలు నిర్మాణం చేపట్టి నిరుపేదలకు వైద్యాన్ని అందుబాటులోకి తీసుకు వస్తామని హామీ ఇచ్చారు. పొన్నూరు మండలంలోని ములుకుదురు, బ్రాహ్మణకోడూరు, పచ్చలతాడిపర్రు, నండూరు వంటి గ్రామాల్లో అధిక జనాభా ఉన్నప్పటికీ ఆ ప్రాంత ప్రజలు వైద్యం కోసం పొన్నూరు పట్టణానికి రావలసిన పరిస్థితులు గతంలో ఉన్నాయి.

నిధులు మంజూరు...

ఎన్నికల హామీల అమల్లో భాగంగా గ్రామీణ వైద్య శాలల నిర్మాణంపై ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ దృష్టి సారించారు. పొన్నూరు నియోజకవర్గం లోని గ్రామీణ ప్రాంత వైద్య సేవల దుస్థితిపై ముఖ్య మంత్రి చంద్రబాబు, ఆరోగ్యమంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామాల్లో ప్రజలకు స్థానికంగానే వైద్య సేవలు అందిస్తే నిరుపేదలకు వైద్యం అందుబాటులోకి వచ్చి ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ విజ్ఞప్తితో నియోజకవర్గానికి వైద్య ఆరోగ్యశాఖ రూ.8.15కోట్లు నిధులు ప్రభుత్వ వైద్య శాల నిర్మాణాలకు మంజూరు చేసింది. నియోజకవర్గంలోని పెదకాకాని మండలంలో పెదకాకాని-1, చేబ్రోలు మండలంలోని చేబ్రోలు-2, 3, నారాకోడూరు గ్రామంలో 1, 2, శ్రీరంగపురం సుద్ధపల్లి వడ్లమూడి, పొన్నూరు మండలంలోని ఆరెమండ, బ్రాహ్మణకోడూరు, నండూరు, పచ్చలతాడిపర్రు గ్రామాల్లోని 13 నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలను ఈ నిధులతో నిర్మించనున్నారు. ఒక్కో భవనానికి రూ.55లక్షలు కేటాయించారు. అలాగే ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పథకం కింద పెదకాకాని మండలంలోని నంబూరు-1, పెదకాని 2, చేబ్రోలు మండలంలోని చేబ్రోలు 4, శలపాడు, పొన్నూరు మండలంలోని దొప్పలపూడి, ములుకుదురులో ఆరోగ్య కేంద్రాల మరమ్మతులు అభివృద్ధికి ఒకొక్కదానికి రూ.25లక్షల చొప్పున మంజూరు చేశారు. త్వరలోనే ఈ నిధులతో భవన నిర్మాణాలు చేపట్టి గ్రామీణ ప్రాంత వైద్యశాలల రూపురేఖలు మార్చేలా అధికారులు చర్యలు ప్రారంభించనున్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో గతితప్పిన గ్రామీణ ప్రాంత వైద్యానికి కూటమి ప్రభుత్వం నూతన రూపురేఖలు తీసుకువచ్చేలా నిధులు మంజూరు చేయడంపై పొన్నూరు నియోజవకర్గంలోని ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

కిటకిటలాడిన ఆలయాలు

● చంద్ర గ్రహణ అనంతర పూజలు



స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



దానాలు ఇస్తున్న భక్తులు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చంద్ర గ్రహణం అనంతరం ఆలయాల్లో పూజలు చేయించుకునేందుకు భక్తులు పోటెత్తారు. పట్టణంలోని ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో దానాలు ఇచ్చేందుకు స్వామి దర్శనం చేసుకుని అభిషేకాలు, పూజలు జరిపించేందుకు సోమవారం వేకువ జామునే తరలివచ్చారు. ఆదివారం రాత్రి చంద్ర గ్రహణం కారణంగా ఆలయాలను మధ్యాహ్నం నుంచి మూసివేశారు. సోమవారం వేకువ జామున సంప్రోక్షణ కార్యక్రమాల అనంతరం భక్తులను అనుమతించారు. ఆలయ సంప్రోక్షణ కార్యక్రమాలు ఆలస్యం కావడంతో ఇది తెలియని భక్తులు ముందుగానే ఆలయాలకు చేరుకున్నారు. దీంతో భక్తుల తాకిడి అధికమైంది. గంగానమ్మపేటలోని పరశురామ ప్రతిష్ఠిత శ్రీపర్వత వర్ధిని సమేత శ్రీరామశ్వరస్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తుల తాకిడి ఊహించకపోవడంతో అధికారులు క్యూలైన్లు ఏర్పాటు చేయలేకపోయారు. ఆలయ ఆవరణలో అర్చకుల వద్ద పూజలు చేయించి దానాలు ఇచ్చేందుకు ఆ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. స్వామి అమ్మవార్ల అభిషేకాలు, పూజలకు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేయాలి

● సబ్ కలెక్టర్‌కు ఎన్జీవో అసోసియేషన్ సభ్యుల వినతి



సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఉద్యోగులు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నిధులు దుర్వినియోగంపై విచారణ జరిపించాలని సంఘ సభ్యులు కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ సంజన సింహాకు వినతిపత్రం అందజేశారు. నిధుల దుర్వినియోగంపై జిల్లా కార్యవర్గానికి ఫిర్యాదు చేసినందుకు కార్యదర్శిని అసోసియేషన్ నుంచి సస్పెండ్ చేశారని తెలిపారు. సెప్టెంబరుతో కార్యవర్గం పదవీ కాలం పూర్తవుతుందని, ఎన్నిక జరగకుండా కొత్త కార్యవర్గాన్ని ప్రకటించుకునే ప్రయత్నాలను అడ్డుకోవాలన్నారు. తెనాలి యూనిట్‌లోని అన్ని శాఖలలో ఉన్న ఉద్యోగులకు సభ్యత్వ నమోదు జరిపి పారదర్శకంగా ఎన్నిక నిర్వహించాలని కోరారు.

● తెనాలి అర్బన్: సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 15 దరఖాస్తులు అందించారు. సబ్ కలెక్టర్ సంజనసింహా దరఖాస్తులు పరిశీలించి సంబంధిత విభాగాలకు పంపి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. రెవెన్యూ 6, మెడికల్ 2, మున్సిపల్ 2, పంచాయతీరాజ్ 4, పోలీసు శాఖకు సంబంధించి ఒక దరఖాస్తు అందినట్లు తెలిపారు.

● పొన్నూరు టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 11 అర్జీలు అందినట్లు డిప్యూటీ తహసీల్దార్ ఆలేటి మాధవి తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. రెవెన్యూ సంబంధిత సమస్యలపై 7 అర్జీలు, డ్వాక్రా సమస్యలపై 2 అర్జీలు, సర్వే కోసం 2అర్జీలు అందాయి. కార్యక్రమంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● తెనాలి క్రైం: మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో రెండు అర్జీలు అందినట్లు డిప్యూటీ ఈవో అంకాల శ్రీనివాసరావు తెలిపారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని వినతి

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని గోశాలలో విద్యుత్ షాక్‌తో మృతిచెందిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలని యానాదుల గిరిజన యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ నాగలక్ష్మికి అర్జీ అందజేశారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ అర్జీ అందజేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో తెనాలి మండలం, చిన్నరావూరుకు చెందిన ముగ్గురు వ్యక్తులు ఈ ఘటనలో మృత్యువాత పడ్డారన్నారు. బాధిత కుటుంబాలకు రెండు సెంట్ల స్థలం ఇచ్చి ఆ స్థలాల్లో ఇల్లు నిర్మిస్తామని, అంతేగాక నష్టపరిహారంతో పాటు ఉపాధి కల్పిస్తామని కలెక్టర్, ఆర్డీవో హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఆరు నెలలు గడిచిన బాధిత కుటుంబాలకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కొమరగిరి సూరిబాబు, రావూరి గోపి, పొట్లూరి అశోక్ బాధితులు ఉన్నారు.

దివ్యాంగ పింఛను మంజూరు చేయరూ...



పాలపర్తి హాసిని

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నూరు శాతం వైకల్యంతో బాధపడుతున్నప్పటికి నేటి వరకు పింఛను మంజూరు కాలేదని, అధికారులు స్పందించి పింఛను ఇప్పించాలని పొన్నూరు, నేతాజీనగర్‌కు చెందిన దివ్యాంగురాలు పాలపర్తి హాసిని, ఆమె తల్లి పాలపర్తి లక్ష్మి కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. అనంతరం పాలపర్తి లక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నానని నా కుమార్తెకు పింఛను మంజూరు కావడం లేదన్నారు. 16ఏళ్ల నుంచి మంచానికి పరిమితమైనప్పటికి అధికారులు దయ చూపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నూరుశాతం వైకల్యం ఉన్నప్పటికీ పదో తరగతి చదువుతుందని, ప్రభుత్వం కూడా తల్లికి వందనం అందించారని వివరించారు. కానీ పింఛను విషయంలో స్థానిక సచివాలయ సిబ్బంది అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. జీతం కంటే మందుల ఖర్చు ఎక్కువగా ఉంటుందని వాపోయారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి కుమార్తెకు దివ్యాంగ పింఛను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

సీసీ రోడ్లు ఏర్పాటు చేయరూ...

పెదకాకాని, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెదకాకానిలోని సుందరయ్య కాలనీలో అంతర్గత సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ కోరారు. ఈ మేరకు సోమవారం గుంటూరు కలెక్టర్ ఆఫీస్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు అందజేశారు. కాలనీలో 8 అడ్డ రోడ్లు గుంతలు పడి ఇళ్లకు వెళ్లాలంటే వృద్ధులు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారన్నారు.

భర్తను కిడ్నాప్ చేశారంటూ వివాహిత ఫిర్యాదు

● ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు
● మరో పెళ్లి చేసుకోబోతున్నాడంటూ ఎస్పీకి ఫిర్యాదు

గుంటూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రేమించుకుని కులాంతర వివాహం చేసుకున్నామని, పెళ్లి ఇష్టం లేని, అతని కుటుంబ సభ్యులు తన భర్తను కిడ్నాప్ చేసి తీసుకువెళ్లారని నంబూరుకు చెందిన బండ్ల దీపిక సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఫిర్యాదుమేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం విప్పర్లరెడ్డిపాలెంకు చెందిన పోలం సాయి వెంకటేశ్వరరెడ్డి నంబూరులో ఉంటున్న తన అక్క వద్ద మూడు సంవత్సరాల నుంచి గ్రామంలోని వేబ్రిడ్జిలో పనిచేసేవాడంది. అయితే వెంకటేశ్వరరెడ్డి తనకు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం అయ్యాడని, ఈ క్రమంలో ప్రేమించుకున్నట్లు దీపిక తెలిపింది. అయితే మా ప్రేమ వెంకటేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులకు ఇష్టం లేకపోవడంతో గత ఏడాది ఫిబ్రవరిలో కాకినాడలో స్నేహితుల సహకారంతో గుడిలో పెళ్లి చేసుకున్నామన్నారు. కొంతకాలం అక్కడే కాపురం ఉన్నామని తెలిపారు. అయితే వెంకటేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులు పెదకాకాని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో గత ఏడాది మార్చి 30న పోలీసులు తనను తన భర్తను తీసుకొచ్చారన్నారు. తన భర్త తనతో కలిసి ఉంటాననటంతో పోలీసులు ఆయన తల్లిదండ్రులను, మా తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి బైండోవర్ చేశారన్నారు. ఆ తరువాత తాము నంబూరులో కొద్ది రోజులు ఉన్నామన్నారు. అయితే తన భర్త, ఆయన అక్క కలిసి బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టారన్నారు. ఏప్రిల్ 29న బ్యాంకులో బంగారం విడిపించేందుకు సంతకం చేయడానికి రావాలని వెంకటేశ్వరరెడ్డి అక్క ఫోన్ చేసిందన్నారు. దీంతో తన భర్త నంబూరులోని బ్యాంకుకు పెళ్లి సంతకం చేసి బయటకు వచ్చిన సమయంలో తన భర్తను కొట్టి బలవంతంగా కిడ్నాప్‌చేసి తీసుకువెళ్లారన్నారు. అదేరోజు సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే మూడు రోజుల వరకు సీఐని కలవనీయకుండా చేశారన్నారు. చివరకు గత ఏడాది మే1న పెదకాకాని పోలీసులు తన భర్తను స్టేషన్‌కు పిలిపించారన్నారు. ఆయన తల్లికి ఆరోగ్యం సరిగా లేదని పది రోజుల్లో పంపిస్తామని చెప్పి పోలీస్‌స్టేషన్ నుంచి తన భర్తను తీసుకు వెళ్లారన్నారు. ఆ తర్వాత నుంచి తన భర్త ఆచూకీ తెలియలేదన్నారు. ఫోన్ నెంబర్ తెలుసుకొని ఫోన్ చేస్తే నీకు నాకు సంబంధం లేదు అంటున్నాడని, తాను గర్భవతి అని చెప్తే అబార్షన్ చేయించుకోమన్నాడని వాపోయింది. గత నవంబర్లో తనకు బాబు పుట్టాడన్నారు. ప్రస్తుతం తన భర్త తన మేనత్త కూతుర్ని పెళ్లి చేసుకోబోతున్నట్లు తెలిసిందన్నారు. ఈ విషయం గురించి ప్రశ్నిస్తే తనను బెదిరించినట్లు తెలిపింది. అప్పటినుంచి తనకు న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. పోలీసు అధికారులు స్పందించి తనకు, తన బిడ్డకు న్యాయం చేయాలని వేడుకుంది.

సైబర్ సెక్యూరిటీపై అధ్యాపకులకు శిక్షణ



అతిథులను సత్కరిస్తున్న వీవీఐటీ యూనివర్సిటీ అధ్యాపకులు

పెదకాకాని, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిస్కో సంస్థ ఆధ్వర్యంలో వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలాజికల్ విశ్వవిద్యాలయంలో ఆంధ్రప్రదేశ్‌లోని సాంకేతిక అధ్యాపకులకు సైబర్ సెక్యూరిటీ, నెట్వర్క్ అంశాలపై శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభించారు. నేటి నుంచి 12వ తారీకు వరకూ ఐదు రోజులు నిర్వహించనున్న ఈ తరగతులను సిస్కో సంస్థ సౌత్ ఆసియా హెడ్ ఇష్వందర్ సింగ్, ఏపీఎస్ఎస్డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.అనీల్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిస్కో సంస్థ సౌత్ ఆసియా హెడ్ ఇషాందర్‌సింగ్ మాట్లాడుతూ డిజిటల్ దాడుల నుంచి వ్యక్తులను, వ్యాపారాలను ప్రభుత్వ సంస్థలను కాపాడటంలో సైబర్ భద్రత చాలా ముఖ్యమైనదన్నారు. ఆర్థిక లావాదేవీలను సైబర్ సెక్యూరిటీ సురక్షితం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వీవీఐటీయూ రిజిస్ట్రార్ వై.మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ కె.గిరిబాబు ఎఫ్ఎఎస్ఎస్డీసీ జనరల్ మేనేజర్ జి.కిషోర్ కుమార్, సీమన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ రావెల నవీన్, ప్రోగ్రాం సంధానకర్త పుట్ట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆధునిక మరుగుదొడ్ల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మనోహర్

పాఠశాలల్లో మౌలిక వసతులకు ప్రభుత్వం కృషి

● మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్ని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. నెస్లే సంస్థ సహకారంతో రూ.21లక్షలతో మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన స్మార్ట్ టాయిలెట్లను సోమవారం విద్యార్థులతో ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రశ్నించి పాఠశాలల్లో వసతులు, క్రీడలు, విద్యాబోధన గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ, చదువుకునే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం అందించడం చారిత్రాత్మక విషయమన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు నాణ్యమైన దుస్తులు, బూట్లు పుస్తకాల కిట్‌ను అందించినట్లు చెప్పారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని, సెల్‌ఫోన్‌తో కాలం గడిపి జీవితాన్ని వృథా చేసుకోవద్దన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, జెట్టి రేణుక, ఎంఈవో లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

సుల్తానాబాద్‌లో వైద్య శిబిరం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుల్తానాబాద్ వడ్డెర కాలనీలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య శాఖాధికారి మొవ్వా యేసుబాబు, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి రక్షిత్ శార్దూల్ రోగులను పరీక్షించారు. రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వాతావరణ మార్పులు దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా చూడాలని, దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఉమాకాంత్, బాలచంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ దినోత్సవం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్ రోడ్డులోని గౌతమ్ గ్రాండ్‌లో సోమవారం ఫిజియోథెరపీ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ది తెనాలి ఫిజియోథెరపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడు కె.వెంకటకుమార్ మాట్లాడుతూ, ఫిజియోథెరపీకి వైద్యరంగంలో ప్రాధాన్యం పెరుగుతుందన్నారు. విజయసాగర్, చందన, సందీప్, దీప్తి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఉషారాణి దంపతులకు నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

మహిళాభ్యుదయ మార్గదర్శి ఉషారాణి

● విశ్రాంత ఆచార్యులు బోడపాటి కుసుమకుమారి

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్ది మహిళాభ్యుదయానికి మార్గదర్శగా రావులపల్లి ఉషారాణి నిలిచారని విశ్రాంత ఆచార్యులు బోడపాటి కుసుమకుమారి అన్నారు. ఐడియల్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు రావులపల్లి ఉషారాణి ప్రథమ వర్ధంతి సోమవారం పట్టణంలో నిర్వహించారు. ఇందిరా మెమోరియల్ వృద్ధాశ్రమంలో ఈ సందర్భంగా మిక్సీ అందజేశారు. ఉషారాణి దంపతుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యాభివృద్ధికి ఉషారాణి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆదర్శ స్కూల్ ప్రిన్సిపాల్ నాదెండ్ల పద్మావతి, అలపర్తి శివలీల, పాఠశాల పూర్వ విద్యార్థులు అందే దిలీప్, కోట సీతారాం, నాగిశెట్టి సాయి, ఆలపాటి నాగ పవన్, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.



గరికపాటి రాజారావుకు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కళలతో ప్రజలను చైతన్యవంతులు చేసిన గరికపాటి

● ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి రామారావు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కళలతో ప్రజలను చైతన్యవంతులను చేసి దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం జరిపిన మహనీయుడు డాక్టర్ గరికపాటి రాజారావు అని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేటి రామారావు కొనియాడారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం గరికపాటి రాజారావు 62వ వర్ధంతి సభ నిర్వహించారు. రాజారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో రామారామావు మాట్లాడుతూ డాక్టర్ రాజారావు మా భూమి నాటిక ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేశారన్నారు. మా భూమి నాటికలు అనేక గ్రామాల్లో ప్రదర్శించి ప్రజలను దోపిడీదారులకు వ్యతిరేకంగా పోరాడేలా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి కార్యకర్తలు దేవరకొండ శ్రీనివాస్, అంకమయ్య, గురవయ్య పాల్గొన్నారు.

విలక్షణ నటుడు రాజారావు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు నాటక కళారూపాలను విస్తృతంగా ప్రచారం చేసిన విలక్షణ నటుడు గరికపాటి రాజారావు అని జిల్లా ప్రజా నాట్యమండలి అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ చెప్పారు. గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో అమర కళాకారుల సంస్మరణ సభలను సోమవారం ప్రారంభించారు. రాజారావు చిత్రపటానికి నివాళులర్పించారు. హరికథా భాగవతారిణి నాగమణి అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో ఆయన మాట్లాడుతూ, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా ప్రజా నాట్యమండలి రాష్ట్రస్థాయి అధ్యక్షుడిగా జాతీయ నాయకుడిగా ఎదిగారని చెప్పారు. పార్టీ నిషేధ కాలంలో మద్రాసు వెళ్లి సినిమాల్లో నటించారని చెప్పారు. లక్ష్మణరావు, బెన్‌హర్, శ్రీదేవి, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమడెల్టాకు 8216 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకు 8216 క్యూసెక్కులనీరు సోమవారం విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 1,37,100 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్‌ఛానల్‌కు 320, రేపల్లెకాల్వకు 1950, తూర్పుకాల్వకు 739, పశ్చిమకాల్వకు 243, నిజాంపట్నంకాల్వకు 460, కొమ్మమూరుకాల్వకు 3360 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):స్థానిక పసుపుమార్కెట్‌యార్డులో సోమవారం జరిగిన వేలంలో 779 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు, క్వింటాల్‌కు కనిష్టధర రూ. 9,750, గరిష్టం రూ.10,551, మోడల్‌ధర రూ.10,150 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్టధర రూ.9,750, గరిష్టం రూ.10,550, మోడల్‌ధర రూ.10,150పలికాయి.

పారిశుధ్య సమస్యను పరిష్కరించాలి

తాడేపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజలు అంటురోగాల బారినపడకుండా మెడింగ్ కాలేజి వద్ద మురుగునీరు రోడ్లపై చేరకుండా అరికట్టాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ డిమాండ్ చేశారు. సోమవారం ఎంటిఎంసి పరిధిలోని గుండిమెడలో సీపీఎం నాయకులతో కలిసి ఆయన మురుగునీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో మురుగునీరు నిలిచిపోయి దోమలు అధికంగా ఉన్నాయన్నారు. తక్షణమే సచివాలయ అధికారులు మురుగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు పల్లె కృష్ణ, సౌమ్యవాదం, కిషోర్, సురేష్, సతీష్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం

తాడేపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్‌లో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా హెచ్‌ఎం కాకుమాను జోజప్ప ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులను లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మహానగర్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్ గుప్తా, డీసీ జవహర్, నాగేశ్వరరావు, కోటిరెడ్డి, రవి పాల్గొన్నారు.

చేనేత కళాశాల సమస్యలపై వినతి

మంగళగిరి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి చేనేత కళాశాలలో సమస్యలపై అల్యూమినీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరిలోని చేనేత జౌళిశాఖ కార్యాలయంలో కమిషనర్ రేఖారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు గజం శ్రీనివాస్ కళాశాలలో సమస్యలను వివరించారు. వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బాలకోటేశ్వరరావు, షణ్ముగం, రఘు, రాంబాబు, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలి

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని అంజూర్ అటవీభూముల్లో కల్కి ట్రస్టు నిర్మించిన అక్రమనిర్మాణాలను తొలగించాలని కోరుతూ భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య కోరారు. ఈ మేరకు సోమవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో రాజానగరం ఎమ్మెల్యే బలరామకృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. కల్కి ట్రస్టు వారు 21 ఎకరాలను ఆక్రమించి ఆశ్రమం పేరుతో మోసం చేస్తున్నారని ఆరోపించారు. అనుమతులు లేని అక్రమనిర్మాణాలను తక్షణమే కూల్చివేయాలని డిమాండ్ చేశారు.

ఆలయాలలో సంప్రోక్షణ

కాకుమాను, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా అన్ని ఆలయాలలో చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని సంప్రోక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. కాకుమానులో అగస్త్యేశ్వరస్వామి, చెన్నకేశవ స్వామి ఆలయం, కొండపాటూరులో స్వయంభు శ్రీపోలేరమ్మ తల్లి ఆలయం, కొమ్మూరు అగస్త్యేశ్వర స్వామి ఆలయం, రేటూరులో రామలింగేశ్వరస్వామి ఆలయం, అమరామృత లింగేశ్వరాలయం, నృసింహాలయం, వేణుగోపాలస్వామి ఆలయాలలో మూలవిరాట్‌లకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పంచామృత, జలాలతో అభిషేకాలు నిర్వహించారు.

సచివాలయ నోటీసు బోర్డులో రైతుల వివరాలు

పెదనందిపాడు, సెప్టెంబరు, 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావిపాడు, జీజీపాలెం గ్రామాల్లో సచివాలయం నోటీసు బోర్డులో గుంటూరు ఛానెల్ విస్తీరణకు సేకరించనున్న భూయజమానుల వివరాలను సోమవారం ఏర్పాటుచేశారు. సంబంధిత రైతులు నోటీసు బోర్డులో పేర్లను పరిశీలించుకోవాలని, అభ్యంతరాలు ఉంటే ఈనెల 16న నిర్వహించే గ్రామరెవిన్యూ సదస్సుల్లో తెలియజేయాలని అధికారులు తెలిపారు.

నాగేశ్వరరావు మృతికి ఎమ్మెల్యే నివాళులు

పెదనందిపాడు, సెప్టెంబరు, 8(ఆంధ్రజ్యోతి): మం డలంలోని కట్రపాడుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మాదినేని నాగేశ్వరరావు(62) అనారోగ్యంతో ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో మృతిచెందారు. సోమవారం ఆయన మృతదేహాన్ని స్వగ్రామం కట్రపాడుకు తరలించారు. ఆయన భౌతికకాయానికి ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, పలువురు కూట మి నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన వెంట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు జంపని హనుమంతరావు, పీఏసీఎస్ చైర్మన్ బత్తిని వేణుగోపాలకృష్ణ, మాదినేని శౌరిబాబు, గొల్లపూడి శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ సత్యహర్ష, కన్నయ్య, శివరామకృష్ణయ్య, రాంబాబు, వీరయ్య, శివన్నారాయణ, మురళీ, చంద్రయ్య, శ్రీనివాసరావు, రవీంద్ర, కుమారస్వామి, సుధీర్, నాగరాజు, తేజపవన్, అంకమ్మచౌదరి, తదితరులు ఉన్నారు.

ఎరువులు, యూరియా సకాలంలో అందించాలి

● రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజనులో రైతులకు అవసరమైన రసాయన ఎరువులు, యూరియా తదితర వ్యవసాయ ఇన్‌పుట్‌లను సకాలంలో అందించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ కోరారు. ఈ మేరకు సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరి తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి వినతిపత్రం అందించారు. ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఏటా విత్తనాలు వేసే సమయానికి ఎరువుల కొరత ఏర్పడడం వలన రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ముందుగానే అవసరమైన మేరకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఎరువులు సరఫరా చేయకపోవడంతో రైతులు నల్లబజారుకు బలవుతున్నారన్నారు. యూరియా అక్రమరవాణా, అక్రమ నిల్వలు జరుగకుండా కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. రైతు సంఘం యోజకవర్గ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎరువుల కొరత పునరావృతం కాకుండా రాష్ట్రప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు, మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, నేతలు జవ్వాది సాంబశివరావు, బత్తూరి మోహనరావు, పంతగాని మరియదాసు, కళ్లం మోహన్‌రెడ్డి, మదీనాబాబు, ఆళ్ల రామిరెడ్డి, శంకరరావు, చిన్ని సత్యనారాయణ పాల్గొన్నారు.

● దుగ్గిరాల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): యూరియా అధికంగా వినియోగిస్తే అనర్థాలే ఎక్కువని ఏవో ఆర్.విజయబాబు అన్నారు. మండలంలోని చిలువూరులో అధిక యూరియా, ఇతర ఎరువులు వినియోగంతో కలిగే నష్టాలు, దిగుబడిపై ప్రభావం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఏఓ విజయబాబు మాట్లాడుతూ, దీర్ఘకాలం భూసారం దెబ్బతినకుండా ఉండేందుకు ఎరువుల వినియోగం తగ్గించడమే మేలన్నారు. యూరియా అన్ని సొసైటీల్లోనూ అందుబాటులో ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఏఈఓ విజ్ఞాన్‌బాబు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.


అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ, రైతు సంఘం నేతలు


తాడేపల్లి : ఆందోళన చేస్తున్న సీపీఐ, రైతు సంఘాల నేతలు

సీపీఐ, రైతు సంఘాల నేతల ఆందోళన

తాడేపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (ఏపీఆర్ఎస్), సీపీఐ పిలుపులో భాగంగా సోమవారం తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులకు యూరియాని సకాలంలో అందించాలని కోరుతూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎరువుల కొరత లేదని చెప్పడం సరికాదన్నారు. ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని ఆయా జిల్లాలకు పంపించి సమస్య ఉందో లేదో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నేతలు కంచర్ల కాశయ్య, సుహాస్, చిన్ని తిరుపతయ్య, సాంబిరెడ్డి, వీరాస్వామి, వెంకటయ్య, డాంగే, శ్యామ్, బాషా, అలి, కోటేశ్వరరావు, ప్రసాద్ సింగయ్య, హనుమంతరావు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

యూరియా అందించటంలో కేంద్రం విఫలం

తుళ్లూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా అందిచటంలో కేంద్రప్రభుత్వం విఫలమైందని సీపీఐ నాయకులు విమర్శించారు. సోమవారం రైతుసంఘం పిలుపులో భాగంగా ఎంపీడీవో శిల్పాకి రైతుల సమస్యలపై వినతిపత్రం నేతలు సమర్పించారు. కొందరు దళారులు ఎరువులకు కృత్రిమ కొరత సృష్టించి అధిక రేట్లు అమ్ముతున్నారని సిపిఐ నాయకులు కాబోతూ ఈశ్వరరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సకాలంలో యూరియా అందేలా చూడండి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతుల అవసరాలకు తగ్గట్టుగా యూరియా అందేలా చూడాలంటూ సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రత్తిపాడు తహసీల్దార్ సుజాతకు మెమోరాండం అందజేసి అనంతరం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరరావు మాట్లాడుతూ రైతుల అవసరాలకు యూరియా అందకపోగా దుకాణాల వద్ద బ్లాక్ మార్కెట్‌లో ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మేడ హనుమంతురావు, కౌలు రైతు సంఘం కార్యదర్శి పి జగన్నాధం, అంకమ్మరావు, మేడా తాతారావు, గోపిరెడ్డి నాగిరెడ్డి, వీరయ్య, సిద్ద రవి పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు, కార్మికులు

కార్మిక సమస్యలు పరిష్కరించాలని ధర్నా

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేతలు మాట్లాడుతూ ఎంటీఎంసీ పరిధిలో ఆప్కాస్‌లో పనిచేస్తున్న 25మంది పారిశుధ్య కార్మికులను 60 సంవత్సరాల వయస్సు నిండిందనే సాకుతో విధుల నుంచి తొలగించడం దారుణమన్నారు. వయోపరిమితిని 65 సంవత్సరాలకు పెంచాలని, కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, రిటైరైన వారి స్థానంలో వారి పిల్లలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం అడిషనల్ కమిషనర్ కే.శకుంతలకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సీఐటీయూ నేతలు ఎస్ఎస్ చెంగయ్య, ఎం.రవి, వేముల దుర్గారావు, పల్లె కృష్ణ, ఎం.బాలాజీ, వి.వెంగమ్మ, కే.వెంకటేశ్వరమ్మ, వై.శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గుంటూరు విశ్రాంత బిషప్ డాక్టర్ గాలి బాలి

దేవుడు పరీక్షల ద్వారానే మానవుల జీవితాలు చక్కబడతాయి

ఫిరంగిపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేవుడు పరీక్షల ద్వారానే మానవుల జీవితాలను చక్కబెడతారని గుంటూరు విశ్రాంత బిషప్ డాక్టర్ గాలి బాలి అన్నారు. సోమవారం ఫిరంగిపురంలోని కార్మెల్ మాత కొండ వద్ద పరిశుద్ధ మరియమాత జన్మదినోత్సవ సమిష్టి దివ్య పూజాబలిలో ఆయన మాట్లాడారు. గ్రామంలోని విజ్ఞానపురం వద్ద గల మరియమాత మందిరం వద్ద చర్చి ఫాదర్ పాతిమా మర్రెడ్డి ఆధ్వర్యంలో దివ్య పూజాబలి జరిగింది. కొత్తపేటలోని వెళాంగిని మాత స్వర్ణ మందిరం వద్ద భారీ కేక్‌ను ఫాదర్ సాగర్ కట్‌చేశారు. కార్యక్రమంలో ఫాదర్ మద్దు బాలస్వామి తదితర గురువులు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యం

పెదనందిపాడు, సెప్టెంబరు, 8(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ అక్షరాస్యత ద్వారానే అభివృద్ధి సాధ్యమని దీని సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షరాస్యత సాధనలో ముందున్న దేశాలు అభివృద్ధి చెందాయన్నారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, మేధావులు తమ వంతుగా నూరుశాతం అక్షరాస్యతకు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకుడు డి శివనాగేశ్వరరావు, కె అశోక్, మోహన్, అనిల్, సురేష్, మంజుల పాల్గొన్నారు.

కొత్త ఆవిష్కరణలతో వైద్యసేవ చేయాలనేదే లక్ష్యం

● దుగ్గిరాల యువకుడికి నీట్‌లో ఆలిండియా 1933వ ర్యాంకు


తల్లిదండ్రులతో డాక్టర్ ములకల ఓంకార్

దుగ్గిరాల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలకు చెందిన డాక్టర్ ములకల ఓంకార్, నీట్ పీజీ ప్రవేశపరీక్షలో ఆలిండియా స్థాయిలో ర్యాంకు 1933వ ర్యాంకు సాధించి గ్రామస్తుల మన్ననలు అందుకుంటున్నాడు. 2018లో విజయనగరం ఎంఐఎంఎస్ హాస్పిటల్‌లో ఎంబీబీఎస్ 71శాతం మార్కులతో పూర్తిచేశాడు. ఆగస్టు 3న జరిగిన నీట్ పరీక్షకు సంబంధించి 19న వచ్చిన ఫలితాలతో కుటుంబంలో ఆనందాలు వెల్లివిరిశాయి.

విచక్షణారహితంగా ఎరువులు వాడరాదు..

పెదనందిపాడు,సెప్టెంబరు, 8(ఆంధ్రజ్యోతి): విచక్షణారహితంగా ఎరువులు వాడడం వలన భూమిసారం కోల్పోతుందని వాడకం తగ్గించాలని ఏవో సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని నాగులపాడు ఉపమార్కెట్ యార్డులో ఇఫ్‌కో కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పంటలకు మేలు చేసేందుకు బయోఫర్టిలైజర్స్ నానో యూ రియా, నానో డీఏపీ వినియోగించాలని తెలిపా రు. రైతులు అధైర్యపడొద్దని ఎరువులను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇఫ్‌కో జిల్లా మేనేజర్ వి రఘుసురేంద్ర, ఎంజీ వై శ్రీనివాస్. సీఈవో శశిధర్‌రెడ్డి, డీఏఏ ఎం క్రాంతిబాబు, వీఏఏ వెంకటేశ్వరరావు,జీడీసీఎంఎస్ సిబ్బంది డి.వీరశేఖర్ పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా ఉంది..

తుళ్లూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతులకు కావాల్సినంత యూరియా అందుబాటులో ఉందని ఏవో పి.సంధ్యారాణి తెలిపారు. సోమవారం పెదపరిమిలో జరిగిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. అనంతరం గ్రోమోర్ ఎరువులు దుకాణాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ, ప్రవేటు డీలర్లు, రైతుసేవా కేంద్రాల ద్వారా యూరియా సరఫరా అవుతుందని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. యూరియా అందుబాటులో లేదనే అపవాదులు నమ్మవద్దని కోరారు. ఎక్కువ ధరకు యూరియా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సీఐ కొంకా శ్రీనివాసరావు, తహసీల్దార్ హరిబాబు, టీడీపీ రాష్ట్ర నాయకులు నూతలపాటి రామారావు, పుట్టి రామాచంద్రరావు, పాల్గొన్నారు.

తురకపాలెంలో ఎమ్మెల్యే పల్లెనిద్ర


తురకపాలెంలో పల్లెనిద్ర చేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలం, తురకపాలెంలో పల్లెనిద్ర, గ్రామస్తులతో సహపంక్తి భోజన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పాల్గొన్నారు. గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలతో పాటు గ్రామస్తులతో సమావేశాలు జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తురకపాలెం గ్రామ ప్రజల్లో ధైర్యాన్ని నింపేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెవిన్యూ, వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ గ్రామంలో అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. ప్రత్యేక ప్రణాళికతో పారిశుధ్య చర్యలు, తాగునీటికి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. వైద్య పర్యవేక్షణ ఇతర కార్యక్రమాలు కొనసాగుతుయాని వివరించారు. కార్యక్రమంలో కూటమినాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వర్ణ పంచాయతీతో అవినీతికి చెక్

● డీపీవో నాగసాయికుమార్

తుళ్లూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ పంచాయతీ యాప్‌ద్వారా పన్నుల చెల్లింపుతో అవినీతికి ప్రభుత్వం చెక్ పెట్టిందని డీపీవో నాగసాయి కుమార్ చెప్పారు. తుళ్లూరులో ఆక్రమణలు గురించి రిపోర్ట్ తయారుచేసుకోవటానికి ఆయన సోమవారం తుళ్లూరులో పర్యటించారు. అనంతరం తుళ్లూరు పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వర్ణ పంచాయతీ యాప్‌తో చెల్లించవల్సిన ఇంటి పన్నులు సకాలంలో చెల్లించవచ్చన్నారు. సెప్టెంబరు 1 నుండి ఈ యాప్ ప్రారంభమైందన్నారు. పన్ను కట్టిన వెంటనే రసీదు జనరేట్ అవుతుందన్నారు.ఎక్కడున్నా ఆన్‌లైన్ ద్వారా ఆస్తి పన్నులు చెల్లింపులు చేసుకోవాలని డీపీవో సూచించారు.

చిలువూరులో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చిలువూరులో చెక్కుల పంపిణీలో పాల్గొన్న ఎంపీపీ జబీన్, కూటమి నాయకులు

దుగ్గిరాల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): చిలువూరులో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కూటమి నాయకులు సోమవారం అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న, ప్రమాదాల్లో గాయపడి ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న ముగ్గురు తమ సమస్యను స్థానిక నాయకుల ద్వారా మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన లోకేశ్ సీఎంఆర్‌ఎఫ్ నుంచి సాయమందించారు. గ్రామానికి చెందిన ముగ్గురికి నగదు చెక్కులను ఎంపీపీ జబీన్, సర్పంచ్ చిలువూరు మరియమ్మ, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, ఎంపీటీసీ రోజమరియమ్మ, తోటకూర సీతారామయ్య అందించారు.

రూ.2.5 లక్షల ఎల్‌వోసీ చెక్కు అందజేత

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి కొత్తపేటకు చెందిన షేక్ సలీమా మూడేళ్ల కుమార్తె జోయా ఆశ్రత్ అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడ ఆంధ్రా హాస్పిటల్‌లో చికిత్స పొందుతుంది. వైద్యఖర్చుల నిమిత్తం మంత్రి లోకేశ్‌కు అర్జీ ద్వారా విన్నవించుకున్నారు. స్పందించిన లోకేశ్ సీఎంఆర్‌ఎఫ్ అధికారులతో మాట్లాడి రూ.2.50 లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. ఎల్‌వోసీ పత్రాలను స్థానిక టీడీపీ నేతలు సోమవారం జోయా ఆశ్రత్ తల్లికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పడవల మహేశ్, షేక్ రియాజ్, నేతలు శ్రీనివాసరావు, కే.రమేష్‌బాబు, పోలూరి నాగేశ్వరరావు, ఎం.రామకోటేశ్వరరావు, షేక్ సలీమ్ బాషా, బాణాల రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లిలో రూ.80వేలు...

తాడేపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఉండవల్లి గ్రామానికి చెందిన పసుపులేటి మాధవికి మంత్రి నారా లోకేశ్ చొరవతో సీఎంఆర్‌ఎఫ్ నుండి రూ.80వేల విలువైన ఎల్‌వోసీ మంజూరు చేశారు. బాధితురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు టీడీపీ మండల అధ్యక్షుడు దాసరి కృష్ణ ఈ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో వంగా న రేంద్ర, గాదె బసివిరెడ్డి వల్లభాపురం శంకర్, మౌనిక, రాంబాబు, రవితేజ తదితరులు ఉన్నారు.

చిలువూరులో స్వామిత్వ సర్వేను పరిశీలించిన డీఎల్‌డీఓ

దుగ్గిరాల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): భూయజమాని ఆస్తికి సంబంధించి శాశ్వత ధ్రువీకరణ పత్రాన్ని అందించే కార్యక్రమంలో భాగంగా మండలంలో స్వమిత్ర సర్వే యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్న విషయం విదితమే. మండలంలోని చిలువూరు మేజర్ పంచాయతీలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న స్వమిత్ర సర్వేను డీఎల్‌డీఓ కుసుమశ్రీదేవి, ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రమోహన్, డిప్యూటీ ఎంపీడీఓ జవహర్‌లాల్‌లతో కలిసి పరిశీలించారు. ఇప్పటివరకూ గ్రామంలో చేపట్టిన ఇండ్లు, ఖాళీస్థలాలకు సంబంధించి, కార్యదర్శి శరత్ చూపిన రికార్డులను తనిఖీ చేశారు. మొత్తం 2700 వరకూ సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటివరకూ 1200 పూర్తిచేశారు. సర్వేను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.


చిలువూరులో స్వమిత్వ సర్వే జరుగుతున్న తీరును డీఎల్‌డీఓ కుసుమశ్రీదేవికి వివరిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రమోహన్, డిప్యూటీ ఎంపీడీఓ జవహర్, కార్యదర్శి శరత్

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

తాడికొండ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్, మాదక ద్రవ్యాలు, మద్యంకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో అనురాధ పేర్కొన్నారు. సోమవారం తాడికొండ మండలం నిడుముక్కలలోని జడ్పీ హైస్కూల్లో మిషన్ శక్తి సంకల్ప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాలికలు, యువతులు ప్రేమపేరుతో మోసపోవటం, మానవ అక్రమరవాణకు బలై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. బాల్యవివాహాలు జరుతున్నాయని తెలిస్తే హెల్ప్‌లైన్ నెంబర్లకు తెలపాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వో, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కే.కృష్ణకుమారి, మున్నీ పాల్గొన్నారు.

మహిళలంతా చదువుకోవాలి..

తాడికొండ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మహిళలందరు చదువుకొని ఆర్థికంగా ఎదగటానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని జిల్లా వయోజన విద్యాశాఖ ఉపసంచాలకులు కే.ఆంజనేయులు పేర్కొన్నారు. సోమవారం 59వ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా తాడికొండ మండల పరిషత్ కార్యాలయంలో మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్, జిల్లా వయోజన విద్య పర్యవేక్షకులు డి.వెంకటేశ్వరరావు, ఏపీఎం సాంబశివరావు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలి

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించటానికి పోటీలను నిర్వహించాలని లాం చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు పేర్కొన్నారు. సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా లాం చలపతి ఫార్మసీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2ల ఆధ్వర్యంలో లాం, జొన్నలగడ్డలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్స్ కే.ఎన్. రజనీకాంత్, డాక్టర్ జీ, నాగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.


లక్ష్మయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

కొల్లి లక్ష్మయ్యకు ఘననివాళి

మంగళగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంగళగిరికి చెందిన రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ కన్వీనర్ కొల్లి లక్ష్మయ్యచౌదరి సంస్మరణ కార్యక్రమం సోమవారం మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో జరిగింది. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల ప్రముఖులు హాజరై లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే గద్దె రామమోహనరావు, మాజీమంత్రి నన్నపనేని రాజకుమారి, మంగళగిరి మార్కెట్ యార్డు ఛైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్, మాజీ వైస్‌ఛైర్మన్ మన్నెం రమేష్‌బాబు, నేతలు కొత్తపల్లి శ్రీనివాసరావు, మాదల రమేష్‌బాబు, అన్నే చంద్రశేఖర్, బెల్లంకొండ నరసింహారావు, గోవాడ రవి, పాతర్ల రమేష్, గోవాడ దుర్గారావు, రంగిశెట్టి పెద్దబ్బాయ్‌లు లక్ష్మయ్యకు నివాళులు అర్పించారు.


స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న పోతినేని శ్రీనివాసరావు, నేతలు

రేషన్ పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట

● పోతినేని శ్రీనివాసరావు

మంగళగిరి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తెచ్చిన స్మార్ట్‌రేషన్ కార్డుల విధానంతో రేషన్ పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు అన్నారు. మంగళగిరి పట్టణంలోని 27వ వార్డులో సోమవారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోతినేని మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో సీఎం చంద్రబాబు ముందుంటారని చెప్పారు. స్మార్ట్ కార్డులతో రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ సరుకులు తీసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో 27వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పందేటి మణికంఠ, పట్టణ ఉపాధ్యక్షురాలు వాసా పద్మ, నేతలు పందేటి తిరుపతయ్య, రాయపాటి విజయ్‌కుమార్, నక్కా బాలకోటేశ్వరరావు, పఠాన్ రియాజ్ ఖాన్, గజ్జల వెంకట రమణ, కటకం కల్యాణ చక్రవర్తి, నండూరి పురుషోత్తం, వెంకటేశ్వరరావు, ప్రకాష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కమ్మ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ధనేకుల


ధనేకుల సుబ్బారావు

తుళ్లూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కమ్మ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా తుళ్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు ధనేకుల వెంకట సుబ్బారావును నియమిస్తూ కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మూడుసార్లు సుబ్బారావు తుళ్లూరు మండల టీడీపీ అధ్యక్షుడిగా సేవలందించారు. ఈ మేరకు సోమవారం తుళ్లూరులోని మండల టీడీపీ కార్యాలయంలో గ్రామ అధ్యక్షుడు కాటా అప్పారావు ఆధ్వర్యంలో సుబ్బారావుకు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అధిష్టానం సుబ్బారావు సేవలు గుర్తించి సముచిత స్థానం కల్పించటం అభినందనీయమని తాడికొండ ఆర్టీఎస్ కోఆర్డినేటర్ నెలకుదిటి చందు పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, స్థానిక టీడీపీ నాయకులకు ధనేకుల సుబ్బారావు ధన్యవాదాలు తెలిపారు.

రోడ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా హరిదాసు



మంగళగిరి సిటీ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టరుగా మంగళగిరి మండలం నిడమర్రు గ్రామానికి చెందిన బత్తుల హరిదాసు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించిన నాలుగు కార్పొరేషన్ల డైరెక్టర్ల పోస్టుల్లో హరిదాసుకు అవకాశం లభించింది.

ఎస్సీ మహిళా వసతి గృహం ఏర్పాటు చేయాలి

మంగళగిరి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా కేంద్రంగా ఎస్సీ మహిళా వసతిగృహాన్ని ఏర్పాటుచేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ ఫణీంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళగిరిలోని రాష్ట్ర సాంఘీక సంక్షేమశాఖ కార్యాలయంలో ఆ శాఖ డైరెక్టర్ లావణ్యవేణికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. అనకాపల్లి జిల్లా ఏర్పడిన తర్వాత అనేక మంది విద్యార్థినులు దూరప్రాంతాల నుంచి వచ్చి చదువుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుతం అక్కడ ఒకేఒక్క బీసీ మహిళా వసతిగృహం వుండగా, వందమంది విద్యార్థులకు గాను దాదాపు 200మంది విద్యార్థినులు చదువుకుంటున్నారని చెప్పారు. వసతి లేక చాలామంది విద్యార్థినులు తిరిగి వెళ్లిపోతున్నారని వాపోయారు. ఇప్పటికైనా రాష్ట్ర ఉన్నతాధికారులు స్పందించి కొత్తగా ఎస్సీ మహిళా వసతి గృహాన్ని ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నేతలు శశి, బన్నీ, అజయ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.